ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 25 ఫిబ్రవరి 2025



పొలం వద్ద సిద్ధంగా ఉన్న టమోటా నారు

టెర్రకోట... సూపర్...

● కళాకారురాలికి గోవా సీఎం అభినందనలు



టెర్రకోట కళాకారురాలు కళావతితో మాట్లాడుతున్న గోవా సీఎం ప్రమోద్ సావంత్

కురబలకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగళ్లుకు చెందిన టెర్రకోట (మట్టి బొమ్మలు) కళాకారురాలు కళావతిని గోవా సీఎం ప్రమోద్ సావంత్ అభినందించారు. అంగళ్లుకు చెందిన టెర్రకోట కళాకారిణి గోవాలో సోమవారం జరిగిన హస్తకళల ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లు, టీకప్పులు, సాసర్లు, వివిధ రకాల బొమ్మలు ప్రదర్శనలో ఉంచారు. అవి సందర్శకులను బాగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అక్కడి సీఎం కళావతి తయారు చేసిన కళాకృతులను చూసి చాలా బాగున్నాయని అభినందించినట్లు ఆమె తెలిపారు.

టమోటా సీజనొచ్చేసింది...



ఎండాకాలం మొదలైతే చాలు టమోటా పంట సాగుకు రైతు సన్నద్ధం అవుతున్నాడు. ఇప్పటికే ఖరీఫ్, రబీ సీజన్‌లలో నష్టాలు చవిచూసిన రైతులకు సీజన్‌తో పనిలేకుండా ఏటా మూడు కార్లు సాగుచేసే టమోటా పంటలో ఫిబ్రవరిది మొదటిస్థానం. అందుకే పడమట ఎక్కడ చూసినా రైతులు పొలం పనుల్లో బిజీగా కనిపిస్తున్నారు.

● సాగుకు రైతు సన్నద్ధం
● విస్తారంగా పొలం పనులు
● గణనీయంగా పెరగనున్న విస్తీర్ణం

మదనపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి మండలాల్లో టమోటాసాగు భారీగా పెరగనుంది. రైతులే కాదు..కార్పొరేట్ సేద్యం తరహాలో ఉద్యోగులు, వ్యవసాయ వ్యాపారులు టమోటా వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. సాధారణంగా మే, జూన్, జూలై నెలలు మాత్రమే సీజన్‌లుగా చెప్పుకోవచ్చు. ఎండాకాలం కావడంతో ఇతర ప్రాంతాలతో పోలిస్తే చల్లని ప్రదేశమైన ఇక్కడ సాగు చేస్తుంటారు. దీంతో పాటు మంచి లాభాలు కూడా వస్తుంటాయి. ఈ క్రమంలో గత రెండేళ్లు సాగు తక్కువగా ఉండటంతో ధరలు పెరిగి మంచి ఫలితాలు వచ్చాయి.

దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్రస్తుతం ఇబ్బడి ముబ్బడిగా టమోటా సాగుకు సిద్ధమవుతున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టమోటా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా చెర్లోపల్లె ఏరియాలోని పడమటి మండలాలతో పాటు సమీపంలోని కర్ణాటక ఏరియాలో పెద్దఎత్తున టమోటా సాగు చేస్తున్నారు. ఇలా జిల్లాలో 25 వేల హెక్టార్లకుపైగా సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ సీజన్‌లో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు టమోటా మొక్కలు నాటడం మొదలు పెడతారు. రెండున్నర నెలల నుంచి మూడు నెలల వ్యవధితో కాపు మొదలై అనంతరం నెలరోజుల్లో ముగుస్తుంది. ఇలా ఇప్పుడు మొదలు పెట్టే పంటలు జూన్ మొదటి వారం నుంచి కాపు మొదలయ్యేలా చూస్తున్నారు. ఫిబ్రవరిలో నాటే పంటసీజన్‌కు పెద్దగా ధరలు ఉండవని కొందరు రైతులు అంచనా వేస్తుంటారు.

కాకపోతే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, మార్చి, ఏప్రిల్‌తో పోలిస్తే ఇప్పుడే మేలని చెబుతున్నారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగి..మార్చి, ఏప్రిల్‌లో ఎక్కువై..మొక్కలు ఎదుగుదల ఉండదని చెబుతున్నారు. ఇంకొందరైతే రెండు మూడు విడతలుగా రోజుల వ్యవధిలో సాగు చేస్తున్నారు. ఒక పంట పోతే, ఇంకో పంటలో ధరలు ఉంటాయని అంచనా వేస్తూ సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా 2023లో జూలై నుంచి అక్టోబరు వరకు మంచి ధరలు పలకగా, 2024లో మదనపల్లె మార్కెట్‌లో కేజీ టమోటా డబుల్ సెంచరీకి చేరువకు వచ్చింది. క్రేట్ రూ.500 ధర పలికినా నష్టం లేకపోయినా, అసలు వస్తుందని, ఆపైన పోతే లాభాలు వస్తాయని రైతులు చెబుతున్నారు.

ఎకరా భూమిలో టమోటా సాగు చేయాలంటే రైతు స్థోమతను బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తుంటారు. దీనిని సమకూర్చడానికే రైతు అప్పోసప్పో చేయడంలో తలకిందులవుతాడు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన బడా రైతులు, వ్యాపారులు ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు. భూమిని దున్నడం, ప్లాస్టిక్ కవర్ పరచడం, ఎరువులు వేయడం, మందులు పిచికారీ చేయడం, కట్టెలు నాటడం, మొక్క పడిపోకుండా దారం కట్టడం వెరసి ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు ఇప్పటికే కొందరు మొక్కలు నాటేయగా, కట్టెలు సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు పొలాల వద్ద నర్సరీని సిద్ధం చేసుకుంటున్నారు.



మొక్కలకు సపోర్ట్‌గా నాటడానికి సిద్ధం చేస్తున్న కర్రలు



రామసముద్రంలో టమోటా పంట సాగుకు సిద్ధం చేసిన భూమి

కిలో రూ.20 ఉంటే కానీ గిట్టుబాటు కాదు



టమోటా పంట సాగు చేయడానికి ఎంత తక్కువన్నా.. రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టాలి. దుక్కిదున్నడం నుంచి పంటను మార్కెట్‌కు తరలించడం వరకు అంతా ఖర్చుతో కూడుకున్న పని. సాగుకు ప్రతి సంవత్సరం ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. మార్కెట్‌లో టమోటా కిలో రూ.20 పోతేగాని గిట్టుబాటు కాదు. అంతరాకుంటే రైతుకు నష్టమే వస్తుంది. నాకు ఉన్న ఏడు ఎకరాల భూమిలో ప్రతి సంవత్సరం మూడు ఎకరాలకుపైగా సాగు చేస్తుంటాను. ఒక పంటలో నష్టం వచ్చినా..రెండో పంటలో లేదా మూడో పంటలో లాభం వస్తుందని నమ్మకం

- కె.మోహన్‌రెడ్డి, తిరుమలరెడ్డిపల్లె, రామసముద్రం మండలం

సాగు ఈజీ అయినా పెట్టుబడి ఎక్కువ



మిగిలిన పంటలతో పోలిస్తే టమోటా సాగు చేయడం కొంత ఈజీగా ఉంటుంది. పెట్టుబడి పెట్టేవారికి ఇది పెద్ద కష్టమేమీకాదు. రైతులే కాకుండా ఇతరులు కూడా సాగు చేస్తుండటంతో విస్తీర్ణం పెరుగుతోంది. టమోటా పంట రైతు అదృష్టాన్ని పరీక్షించే పంట ఎందుకంటే ధరలు పెరిగినా, అధిక వర్షాలు, వరదలు సంభవిస్తే కొందరికి నష్టం వస్తే, మరికొందరి రైతులకు లాభం వస్తుంటుంది. నేను గతంలో నాలుగు పంటల్లో నష్టపోయాను. ఒక పంటలో మాత్రమే పెట్టుబడి వచ్చింది. ప్రతి సంవత్సరం నాలుగు ఎకరాలో సాగు చేస్తా. ఈసారి కూడా టమోటా వేయడానికి భూమిని సిద్ధం చేస్తున్నా.

- కె.గంగిరెడ్డి, పిడమవారిపల్లె, పీటీఎం మండలం

ఏసీబీ వలలో చేనేత, జౌళి శాఖాధికారి

● రూ.70 వేలు లంచం తీసుకుంటూ...



ఏసీబీకి పట్టుబడ్డ చేనేత, జౌళి శాఖ ఇన్‌చార్జ్ ఏడీ కృష్ణ

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా చేనేత, జౌళి శాఖ ఇన్‌చార్జి ఏడీ బి.కృష్ణ లంచం తీసుకుంటుండగా సోమవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. విజయలక్ష్మి టెక్స్‌టైల్స్ ప్రొడక్షన్ కంపెనీ స్థాపించుకునేందుకు ఓ వ్యక్తి అర్జీ పెట్టుకున్నాడు. దానిపైన ఇక్కడ ఉన్న ఏడీ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ స్థాపించేందుకు కమీషన్ రేటుకు దానిని రెకమండ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం అతడి దగ్గర రూ.1.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నేను అంత ఇచ్చుకోలేను అని బాధితుడు చెప్పడంతో ముందు రూ.70 వేలు ఇవ్వాలని, పని అయిపోయిన తర్వాత మిగతా రూ.80 ఇవ్వాలని బేరం కుదుర్చుకున్నాడు. దీనిపైన బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం మధ్యాహ్నం బాధితుడి దగ్గర నుంచి నుంచి రూ.70 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నామని ఏసీపీ డీఎస్పీ జెర్సీ ప్రశాంతి మీడియాకు తెలిపారు. ఇతడిని కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం ప్రదర్శించొద్దు

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా విచారించి న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నడవలేని స్థితిలో ఓ వృద్ధురాలు, ఒక దివ్యాంగురాలి వద్దకు వెళ్లి సమస్యలు వారి విని పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే కురబలకోట మండలంలో అంగళ్ల గ్రామంలో ప్లాట్ల యజమానులు అందరూ కలిసి ఎస్పీకి వారి సమస్యపై ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి ఎస్పీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.

వైభవంగా... వీరభద్రుడి కళ్యాణం

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు సోమవారం వీరభద్రుడి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డిలు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి రాయచోటి పట్టణ ప్రజలే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి మహిళా భక్తులు సుమంగళిపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వీరభద్రుడు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు జయరాంరెడ్డి, శివారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మదన్‌మోహన్, పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఎప్పుడిస్తారో..?

● శ్రీనివాసపురం రిజర్వాయర్ బాధితుల ఎదురుచూపు
● వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోని ప్రజాప్రతినిధులు
● ఈ ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురం రిజర్వాయర్ నుంచి కాలువల నిర్మాణం చేపడితే తమ భూములకు నీరంది పంటలు పండించుకోవచ్చన్న ఆశతో కాలువ నిర్మాణానికి తమ భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకపోవడంతో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. 2012లో చిన్నమండెం మండలంలోని 20 వేల ఎకరాల ఆయకట్టు కోసం శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టారు. సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండలాలకు నీరందించేందుకు కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. చిన్నమండెం, మల్లూరు. నేరాలంక, గొల్లంగూడు, కదిరివాండ్లపల్లె, చెర్లోపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, ఎండపల్లె, బట్లచెరువు, గుంతరాచపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లె మండలంలోని చిలకవాటికవాండ్లపల్లె, కాకుళవరం, కస్తూరిరాజుగారిపల్లె, ఎగువ బత్తెనపల్లె, దిగువబత్తెనపల్లె, సిద్ధకవాండ్లపల్లె, పిచ్చికుంటపల్లె, తురకపల్లె, గురయ్యగారిపల్లె, ఈడిగపల్లె, మద్దిరేవుల గ్రామాల పొలాలకు సాగునీరు అందించేందుకు కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. ఈ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు పొలాలకు లక్ష రూపాయలు, మామిడి, నిమ్మ తోటలకు ఎకరాకు 4 నుంచి 5 లక్షల రూపాయలు ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. అయితే లక్కిరెడ్డిపల్లె మండలంలోని కొంతమంది రైతులు ఆ సమయానికి అందుబాటులో లేకపోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు సక్రమంగా లేకపోవడంతో వారికి పరిహారం పంపిణీ వాయిదా పడింది. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు సిద్దక నాగిరెడ్డి, గోరల్ల యల్లమ్మ, సిద్దక కవిత, బొమ్మాడ వాసుదేవరెడ్డి, గొందిపల్లె వెంకటయ్య, ఈశ్వరయ్య, ఈర్ల నారాయణ గొర్ల అలివేలి తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ మా సమస్యను పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలువకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కాకుళవరం నుంచి సిద్దకవాండ్లపల్లె మీదుగా వెళుతున్న శ్రీనివాసపురం రిజర్వాయర్ కాలువ

భూమి పోయింది.. పరిహారం రాలేదు



కాలువ నిర్మాణంలో 5 ఎకరాలు కోల్పోయాము. మాఅన్నదమ్ములు అందరికీ కలసి 5 ఎకరాలు పొలం ఉండేది శ్రీనివాసపురం రిజర్వాయర్ కాలువకు ఉన్న పొలం పోయింది. దాదాపు మా కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం రావాలి. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాము రేపు మాపు అంటూ మాటలు చెప్పారు. ఒక్క రూపాయి కూడా పరిహారం రాలేదు. ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశలు పెట్టుకున్నాం.

- బి.వాసుదేవరెడ్డి, సిద్దకవాండ్లపల్లె

70 సన్న నిమ్మచెట్లు కోల్పోయాను



మాకున్న 2 ఎకరాల పొలంలో 70 సన్ననిమ్మచెట్లు కాలువకు పోయాయి. పరిహారం సుమారు 5 లక్షల రూపాయలకు పైగా రావాలి. 8 సంవత్సరాల నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి చెప్పులరిగాయే తప్ప తప్ప పరిహారం మాత్రం ఇంతవరకు అందలేదు. ఎన్నోసార్లు కలెక్టర్లకు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్న పొలాన్ని, నిమ్మచెట్లను పోగొట్టుకున్నాం పరిహారం అందించి ఆదుకోండి.

- సిద్దక కవిత, రైతు, సిద్దకవాండ్లపల్లె

ప్రజల సమస్యలకే ప్రథమ ప్రాధాన్యం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదనరావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన కొన్ని విజ్ఞప్తులు

మదనపల్లె మండలం బండమీద కమ్మపల్లి, సిరికల్చర్ కాలనీ, సర్వే నెంబర్ 423/2 దాదాపు 70 మంది ఓ స్థలానికి డబ్బులు చెల్లించి తమ పేర్లతో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. అయితే అక్కడ ఉన్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ మా స్థలాల్లోకి మమ్ములను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● పీటీఎం మండలానికి చెందిన నారాయణప్ప తన భూమిని కొందరు ఆక్రమించారని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు.

ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌పై విచారణ

● పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీలేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కాలంలో తమ కార్యాలయంలో జరిగిన ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌పై సమగ్ర విచారణ జరిపించనున్నట్లు పీలేరు గ్రామ పంచాయతీ ఈవో గురుమోహన్ తెలిపారు. పీలేరు గ్రామ పంచాయతీలో ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో అవకతవకలు జరిగినట్లు సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ఇదో రకం మోసం' శీర్షికతో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన తరువాత మరికొంతమంది బాధితులు తాము మోసపోయినట్లు ఈవో గురుమోహన్‌ను సంప్రదించారు. దీంతో ఆయన స్పందించారు. ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో అవకతవకలు జరిగినట్లు గతంలోనే తన దృష్టికి వచ్చినప్పటికీ సోమవారం 12 మంది తనను సంప్రదించినట్లు వెల్లడించారు. తాము సర్పంచుల మాట మేరకు నగదు చెల్లించామని, తమ ప్లాన్‌లు పంచాయతీ రికార్డుల్లో లేనట్లు తెలిసిందని వారు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని తాను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వారి సూచనల మేరకు మూడేళ్ల కాలంలోని ప్లాన్ అప్రూవల్స్‌పై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. మూడేళ్ల కాలంలో వచ్చిన అప్రూవళ్లు, పంచాయతీ రికార్డుల్లో నమోదైనవి, నమోదు కాకుండా ఉన్నవి త్వరలోనే తేలుస్తామన్నారు. అయితే ఇంటి ప్లాన్ అప్రూవల్స్ కోసం వచ్చే వారు నేరుగా తనను తన కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అప్రూవల్స్ కోసం తాము నేరుగా నగదు స్వీకరించడం లేదని, తాము అందించే సీఎంఎఫ్ఎస్ ఆన్‌లైన్ చలానాను తీసుకెళ్లి బ్యాంకులో నగదు చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. తాను పీలేరు ఈవోగా గత ఏడాది అక్టోబరు 17న బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇదే పద్ధతి పాటిస్తున్నట్లు తెలిపారు.



సహస్ర కలశాభిషేకం

కలికిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. మాఘమాసం చివరి ఏకాదశి సోమవారం కావడంతో శివరాత్రి పర్వదినానికి అంకురార్పణ కోసం ఈ కలశాభిషేకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నపత్రాలు

పీలేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం పీలేరు పోలీసుస్టేషన్‌కు చేరాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డప్ప, జి.బేబీ కరుణ విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలో ఇంటర్ పరీక్షల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, చిత్తూరు మార్గంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాన్ని పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. మార్చి 1న ప్రథమ, 3న ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు సూచించారు.


పీలేరు పోలీసుస్టేషన్‌లో ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్లు

ఝురీ స్నానం..

సర్వ పాపహరణం



● మహాశివరాత్రికి సిద్ధమవుతున్న శివాలయాలు

మహా శివరాత్రి సందర్భంగా కలకడ సమీపంలోని సత్యవతి, బాహుదా నదుల సంగమం వద్ద పుణ్యస్నానాలకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రామసముద్రం మండలంలోని వాలీశ్వరాలయ రథోత్సవానికి కొత్త తేరు సిద్ధమైంది

కలకడ,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి మరునటి రోజు నిర్వహించే ఝురి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. కలకడకు తూర్పున దాదాపు 6కిలో మీటర్ల దూరంలో సత్యవతి, బాహుదా నదుల సంగమంతో ఏర్పడే ఈ ఝురిలో మునిగితే సర్వపాపాలు హరించుకుపోయి పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహా శివరాత్రి జాగరణ అనంతరం ఝురికి చేరుకొని పుణ్యస్నానాలాచరిస్తారు. రాయలసీమ జిల్లాల నుంచేకాక హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర నగరాల నుంచి వేలాదిగా తరలివస్తారు. స్నానాలు చేసేటప్పుడు, తోపులాట జరిగినపుడు భక్తులు నీటిలో పడిపోకుండా ఆలయ నిర్వాహకులు తాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఝురి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం పీలేరు, మదనపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల్ని రెండు మార్గాల్లో పంపుతారు.


కలకడ సిద్దేశ్వరాలయం

బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

కామాక్షీ సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా చేస్తున్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తలనీలాలు సమర్పించే భక్తులు స్నానాలారించేందుకు పుష్కరిణిలో నీరుంది. మహా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో ఎర్రయ్యగారిపల్లె వద్ద ఉన్న ఆర్చి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

శివాలయాలకు నెలవు పీలేరు

పీలేరు, ఫిబ్రవరి 24: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయం, మండలంలోని శివరామాపురం భ్రమరాంబ మల్లికా ర్జున స్వామి ఆలయం, జంగంపల్లె లోని వీరభద్ర, అడవి పల్లెలోని గుం డాల మల్లేశ్వర స్వామి ఆలయాలు మ హాశివరాత్రి పర్వదినానికి ముస్తాబ య్యాయి.

సూర్యకిరణాలతో అభిషేకం..

పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని ప్రతి మాఘ మాసంలో సూర్యకిరణాలు స్పర్శిస్తుం టాయి. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా పందిళ్ల ఏర్పాటు, శుక్రవారం అంకురార్పణ చేశారు.

శ్రీశైలం తరహాలో..

దొడ్డిపల్లె పంచాయతీలోని శివరామాపురంలోని గార్గేయ నదీ ఒడ్డున ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం శ్రీశైలంలోని ఆలయాన్ని తలపిస్తుంది. శ్రీ శైలం వెళ్లలేని వారి కోసం పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించారని తెలుస్తోంది. ప్రతి శివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

భళా.. వీరభద్రా..

వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని వీరభద్ర స్వామిని ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. సమస్యలతో బాధపడే వారు వీరభద్రుడిని నమ్ముకుంటే తప్పక కాపాడతాడని జంగంపల్లె వాసుల విశ్వాసం. ఈ ఆలయంలో ఆలయానికి అనుబంధంగా జమ్మి చెట్టు ఉండడంతో పీలేరుతోపాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కార్తీక మాసంలో వీరభద్రుడిని పెద్దసంఖ్యలో దర్శించుకుంటారు. శివయ్య భక్తులతోపాటు అయ్యప్పస్వామి భక్తులు కూడా ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.

ప్రకృతి ఒడిలో గుండాల మల్లేశ్వరుడు

పీలేరు మండలం తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న అటవీ ప్రాంతంలో వెలసిన గుండాల మల్లేశ్వరుడు సంతాన లేమితో బాధపడే వారికి సంతానాన్ని ఒకసే కల్పతెరువుగా విరాజిల్లుతున్నాడు. అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య సేద తీరే మల్లేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, శివరాత్రి సందర్భంగా జాతర జరుగుతుంటాయి. కార్తీక మాసంలో ఆయనను దర్శించుకుని ఏదైనా మొక్కుకుంటే శివరాత్రి వచ్చేలోపు ప్రసాదిస్తాడని భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు అడవిపల్లెలో జాతర జరుగుతుంది. ఆ జాతర కోసం ఇటీవల నూతనంగా నియమితులైన ఉత్సవ కమిటీ సభ్యులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



శివరామాపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి.. అడవిపల్లెలోని గుండాల మల్లేశ్వర స్వామి ఆలయం

వాలి ప్రతిష్ఠించిన శివలింగం..

రామసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాలీశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవు తోంది. ఆర్.నడింపల్లె పంచాయతీ బలసంద్రం గ్రామ సమీపంలోని కొండపై ఉన్న ఈ ఆలయాన్ని చోళ రాజుల హయాంలో ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న పుంగనూరు దొరవారు నిర్మించా రని చెబుతారు. కాగా ఈ ఆలయంలోని శివుడు వాలీశ్వరస్వామిగా పేరు పొందడానికి కారణాన్ని ఇలా వివరిస్తారు త్రేతాయుగంలో వానర రాజైన వాలి తన జోలెలో ఒక శివ లింగాన్ని ఉంచుకుని వనసంచారం చేసేవాడట. ఈ క్రమంలో బలసంద్రం వద్దనున్న కొండ మీదకు చేరుకున్న ఆయన రాత్రి కావడంతో తన జోలెలోని శివలింగాన్ని తీసి ఒకచోట ఉంచి పూజలు చేసిన అనంతరం నిద్రించాడు. ఉదయం శివలింగాన్ని తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అది కదలకపోవడంతో, ఆరోజు కూడా కొండపైనే నిద్రించాడు. ఆ రాత్రి శివుడు వాలికి కలలో కనిపించి తాను ఈ కొండలోనే ఉంటానని తనను తీసుకె ళ్లడానికి ప్రయత్నించవద్దని చెప్పాడట. అలా వాలి వలన వెలసిన శివుడు కావడంతో వాలీశ్వరస్వామి అని పేరు వచ్చిందని చెబుతారు. ప్రతి ఏటా మహాశివరాత్రికి ఇక్కడ రెండు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



శివరాత్రికి లక్షల్లో భక్తులు.. : వాలీశ్వరస్వామి కొండకు రోడ్డుమార్గం సుగమం కావడంతో ఈ సారి శివరాత్రి వేడుకలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు అంటున్నారు. రథోత్సవం కోసం నూతన తేరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కల్యాణం.. చూతము రారండి..

● మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మల్లయ్యకొండ

● 71 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. 25వ తేదీ మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 26వ తేదీ తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, సహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు స్వామి వారి మెరవణి నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి : భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా కొండపైన క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులు ఎండబారిన పడకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొండపైన నీటి సమస్య తలెత్తకుండా నూతన బోరు వేశారు. రాత్రి సమయాల్లో కొండకు ఎక్కే భక్తులకు ఇబ్బంది లేకుండా ఘాట్ రోడ్డు పొడవునా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు 71 ఆర్టీసీ బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం వెంకట్రమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి 20 బస్సులు, తంబళ్లపల్లె (రాగిమాను కూడలి) నుంచి 10, బి.కొత్తకోట, ములకల చెరువు, పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, అక్కడి నుంచి కొండపైకి 35 బస్సుల చొప్పున నడపనున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో మునిరాజ తెలిపారు సులభంగా దర్శనం అయ్యేలా చలువ పందిళ్లతో రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశామని, కొండపైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామటఅని తెలిపారు.

భూ ఆక్రమణ యత్నం అడ్డుకోండి

● కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన

కురబలకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని స్టోర్ అలియాస్ గండు గండు రాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ముంబై-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్ 220లో తాము కొనుగోలు చేసి భూమిని అనంతపురాన్ని చెందిన నేతలు భూమిని ఆక్రమించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక నేతలు ఈ వివాదంలో తలదూర్చుతున్నారన్నారు.

గతంలో ఈ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు నిషేధాజ్ఞలు విధించారని, ఈ భూమికి మళ్లీ అదే విధంగా రక్షణ కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు త భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహరీగోడను కూల్చివేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమికి రక్షణ కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

సంతకాలు లేకుండానే బిల్లుల చెల్లింపు?

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం

● ఒక టీఏ, నలుగురు ఎఫ్ఏలకు జరిమానా

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంతకాలు లేకుండానే ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించిన వైనం సామాజిక తనిఖీ సమావేశంలో వెలుగులోకి వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 18వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. రూ.7.47 కోట్లతో 486 పనులు చేయగా ఇందులో కూలీల వేతనాలకు రూ.5.85 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.62 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా పనుల నిర్వహణ, నిధుల దుర్వినియోగం కింద కేవలం రూ.8639 రికవరీకి ఆదేశించడం విశేషం. బాలయ్యగారిపల్లె పంచాయితీలో 8 ఇంకుడు గుంతల పనికి రూ.42,128 ఖర్చు చేయడంపై డీఈ నేతృత్వంలో విచారణకు నిర్ణయించారు. పండ్ల తోటల పథకం కింద లబ్ధిపొంది, మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపని 21 మందికి నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఓ టెక్నికల్ అసిస్టెంట్, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధించారు. అనంతరం పీడీ వెంకటరత్నం కార్యాలయ సమావేశ ప్రాంగణంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కరువు ప్రాంతమైన కలకడ మండలంలో కూలీలకు 150 పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ఫారంపాండ్లు, ఇంకుడు గుంతల పనులను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎస్ఆర్పీ సుబ్బారావు, ఏపీవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌లో గత నెల 24 న జరిగిన ఆటో చోరీ కేసులో తిరుపతి పట్టణంలోని జీవకోన గాంధీ కాలనీకి చెందిన చిన్నం గారి షణ్ముగంను అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. మండలంలోని జంగిటివారిపల్లికు వెళ్లె మార్గంలో ఆటోలో పారిపోతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారు, ఆటో ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని మాధవరం గ్రా మం శీతల గంగమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప నుంచి చాముండేశ్వరిపేటకు వస్తున్న ఆటో, తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్కే నగర్‌కు చెందిన కృష్ణయ్య (68) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కారు ఆగకుండా కడప వైపు వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు.

500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు దగ్ధం

ములకలచెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువుకు సమీపంలో ఉన్న కనుగొండకు సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు 500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు అగ్నికి ఆహుతైంది. మంటలు భారీగా ఎగసి చుట్టు పక్కల వ్యాపించాయి. విలువైన ఔషధ మొక్కలు, పశు గ్రాసంతో పాటు వన్య ప్రాణులు మంటల బారిన పడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే మంటలు కొండపైకి వ్యాపించాయి. దీంతో కొండ పైకి వెళ్లేందుకు వీలు కాలేదు. మంటలు కొండంతా వ్యాపిస్తే వేల ఎకరాల్లో అడవికాలిపోయే ప్రమాదం ఉంది.


అగ్నికి ఆహుతవుతున్న కనుగొండ అటవీ ప్రాంతం

ఎర్రగొండకు నిప్పు

●కంది, మిరప పైర్లు వ్యవసాయ సామగ్రి బుగ్గిపాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగొండ అటవీ ప్రాంతంలో ఆదివారం మంటలు రేగడంతో, సమీపంలో ఉన్న పొలాలకు నష్టం వాటిల్లింది. అటవీ భూమికి ఆనుకొని ఉన్న సంబేపల్లెకు చెందిన రైతు వెంకటేశ్వర్లు పొలంలో ఉన్న 700 టమోటా కట్టె, స్టార్టర్ బాక్సు, 6 స్ప్రింకర్ పైపులు కాలిపోయాయి. దాసరివాండ్లపల్లె రైతు నాగేశ్వరకు చెందిన రెండు ఎకరాలకు కంది పైరు కాలిపోగా, రామాంజులుకు చెందిన మిరప పైరు వాడిపోయింది. తమకు కలిగిన నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.


ఎర్రగొండకు నిప్పంటుకోవడంతో కాలిపోయిన కందిపైరు

'నాటుసారా రహిత సమాజం వైపు అడుగులు వేద్దాం'

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత సమాజం వైపు అడుగుల వేయాలని తహసీల్దార్ అమరనాథ్, ఎస్ఐ తిప్పే స్వామి, ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నిమ్మనపల్లి పంచాయతీ నాగులయ్యగారిపల్లిలో నాటుసారా వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా అమ్మడం, తాగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నాటుసారా ధర తక్కువగా ఉండటం వలన ఎంతోమంది దీనికి బానిసలవుతున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. నాటుసారా లేని సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, మల్లప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు


నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిట్స్ కాలేజీలో సక్సెస్ మీట్


కేక్ కట్ చేస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

రాయచోటి, ఫిబ్రవరి 24: జేఎన్‌టీయూ అనంతపురం వారు విడుదల చేసిన ఫస్ట్ ఇయర్ సెమిస్టర్‌లో బిట్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో పఠాన్ సాజిదాఖానమ్, సీఎస్‌సీ 87.5 శాతం కైవసం చేసుకుని యూనివర్సిటీ టాపర్ల జాబితాలో నిలిచారు. అలాగే ఏఐలో సాయిదర్శిని 80.8 శాతం సాధించారు. అలాగే మరో 20 మంది విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువగా, 30 మంది 70శాతం కన్నా ఎక్కువగా మార్కులు సా ధించారు. కళాశాల స్థాపకుడు మన్నూరు భాస్కర్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాలేజీ స్థాపించిన అనతి కాలంలోనే ఇంత విజయం సాధించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.

సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్ నిలిపివేయాలి

పీలేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు జూనియర్ సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని మాదిగల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపోగు శ్రీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేంత వరకు టీచర్ల భర్తీని నిలిపి వేసిన ప్రభుత్వం జూనియర్ సివిల్ జడిల నియామక ప్రక్రియను కూడా నిలిపి వేయాలన్నారు. హైకోర్టు ఇటీవల వెలువరించిన జడ్జిల నియామక నోటిఫికేషన్‌లో ఎస్సీలకు వర్గీకరణ చూపకుండా కేవలం 4 ఖాళీలు చూపిందన్నారు. మొత్తం 50ఖాళీలు ఉండగా ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ మేరకు 8 పోస్టులు రావాలన్నారు. వర్గీకరణ లేకపోవడంతో ఆ పోస్టులు కూడా మాలలకు దక్కే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై దృష్టి సారించి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



సాయం కోసం...

- చేనేతల ఎదురుచూపులు
- 110 సొసైటీలకు అందని ఉపశమనం
- కోట్ల రూపాయల నాబార్డ్ నిధులు హోల్డ్‌లో
- సీఐడీ కేసులను బూచిగా చూపుతున్న అధికారులు

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధుల కోసం చేనేతలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నా రు. కేంద్ర ప్రభుత్వం 80శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20శాతం నిధులు కేటాయించి పునరుద్ధరణ సంస్కరణ పునర్నిర్మాణం (ఆర్ఆర్ఆర్) పథకం కింద నాబార్డు ద్వారా సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో 2013లో చేనేత, జౌళిశాఖ అధికారులు ఉమ్మడి కడప జిల్లాలో నష్టాల్లో కూరుకుపోయిన చేనేత సంఘాలను తిరిగి పునరుద్ధరించేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు నాబార్డు నుంచి రూ.13.68 కోట్లు జిల్లాలోని 110 చేనేత సహకార సొసైటీలకు మంజూరైంది. ఇందుకు సం బంధించి 2020 సెప్టెంబరు 25వ తేదీ నిధులు విడుదల చేశారు. ఇందులో 15 సంఘాలకు సంబంధించిన రూ.1.97 కోట్ల పాత బకాయిలను బ్యాంకు అధికారు లు జమ వేసుకున్నారు. మిగిలిన సంఘాలకు సంబంధించి రూ.11.19 కోట్లు నిధులు ఇప్ప టికీ విడుదల చేయకపోవడంతో నాబా ర్డు ఉద్దేశం నీరుగారపోతోందని చేనేత సంఘాల ప్రతినిధు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత అప్పులోకి జమ

నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలను ఆదుకునేందుకు నాబార్డు సాయమందిస్తే పాత అప్పులోకి రూ.1.97 కోట్లు డీసీసీబీ అధికారులు జమ వేసుకున్నట్లు సమాచారం. ఇందులో కొండమాచుపల్లె వీవర్స్ కోఆరేటివ్ సొసైటీ రూ.12.37లక్షలు, మారుతీ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ దత్తాపురం రూ.17.40 లక్షలు, జమ్మలమడుగుకు చెందిన శ్రీభార్గవమ్మ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.16.92లక్షలు, వేపరాలకు చెందిన శ్రీచౌడేశ్వరి సొసైటీ రూ.24.95లక్షలు, అప్పనపల్లె మహిళా కోఆపరేటివ్ సొసై టీ రూ.11.97లక్షలు, కోనరాజుపల్లె సొసైటీ రూ.6.5లక్షలు, తిరువెంగళాపురం సొసైటీ రూ.19.70లక్షలు, జమ్మలమడుగులోని శ్రీహరి వీవర్స్ కోఆపరేటివ్ సొసైటటీ రూ.6.61లక్షలు పాతబకాయి కింద జమ అయ్యాయి. అదేవిధంగా ప్రొద్దుటూరుకు చెందిన లతా వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.4.31లక్షలు, శ్రీవేంకటేశ్వర సొసైటీ రూ.39.57లక్షలు, మోరగుడికి చెందిన తిరుమల సొసైటీ రూ.19.58 లక్షలు, శిరీష సొసైటీ రూ.8.14లక్షలు డీసీసీ బ్యాంకు పాత బకాయిల్లోకి సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది.

సాయం కోసం అగచాట్లు

ముందుగా నాబార్డు నిధులు విడుదలైన తర్వాత వాటిని పంపిణీ చేయకుండా తిరిగి నాబార్డుకు పంపించినట్లు సమాచారం. అయితే చేనేత కార్మికులు, నాయకులు కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి తిరిగి నాబార్డు సాయాన్ని పొందినట్లు చెబుతున్నారు. ఇక సాయం అందుతుందని ఎదురుచూసే సమయంలో చేనేత జౌళి శాఖ అధికారులు ఈ సాయాన్ని ఆపాలంటూ బ్యాంకు అధికారులకు లెటర్ ఇవ్వడంతో నాబార్డు రుణం తమకు దక్కకుండా పోయిందంటున్నారు. చేనేత జౌళిశాఖ అధికారులు కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారని.. పలు సొసైటీలపై సీఐడీ విచారణ పెండింగ్‌లో ఉందని బ్యాంకుకు లెటర్ రాయడంతోనే తమకు సాయం నిలిచిపోయిందని వివరిస్తున్నారు. ప్రస్తుతం ట్రిపుల్ఆర్ విడుదలైన జాబితాలో ఉన్న మోరగుడికి చెందిన శ్రీతిరుమల వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ, ప్రొద్దుటూరుకు చెందిన గాంధీరోడ్డు వీవీర్స్ కోఆపరేటివ్ సొసైటీ, శిరీష వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి మాత్రమే సీఐడీ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సొసైటీలు ఆప్కోకు లివరీ సరఫరా చేశారంటూ ఆప్కో అధికారులు సీఐడీకి ఆ సొసైటీలకు సంబంధించిన రికార్డులను అందజేసినట్లు తెలుస్తోంది. కానీ దీన్ని సాకుగా చూపి మిగిలిన సొసైటీలకు కూడా నాబార్డు రుణం అందకుండా చర్యలు తీసుకోవడంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలు మరింతగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని సంఘాలకు ట్రిపుల్ఆర్ పథకాన్ని అమలు చేసిన అధికారులు తమ సంఘాలకు కూడా నాబార్డు సాయాన్ని అందించాలంటూ చేనేత శాఖ అధికారులతో పాటు కలెక్టర్లను కూడా పలు దఫాలుగా కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికి నేతన్నలకు ఫలితం దక్కలేదు.

అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది



చేనేత సహకార సొసైటీలకు నాబార్డు ద్వారా అందిన రుణా న్ని లబ్ధిదారులు పొందేలా సహకరించాలి. నాబార్డు ఎలాంటి ఆంక్షలు విధించకున్నా ఏదో ఒక కారణం చెబుతూ ఇక్కడ అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది. అన్ని సొసైటీలకు అందిన రుణాన్ని ఇచ్చేందుకు అభ్యంతరం చెబుతున్న అధికారులు బ్యాంకుకు బకాయి ఉన్న సొసైటీల రుణాలను ఏ విధంగా సర్దుబాటు చేసుకున్నారు.

- అవ్వారు మల్లికార్జున, బీసీ నేత

చర్యలు తీసుకుంటాం..

కడప జిల్లా నుంచి రికార్డులు తెప్పించుకుంటున్నాము. అక్కడి సమస్యను పరిశీలించి చేనేత సహకార సంఘాలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్, అదనపు సంచాలకులు చేనేత జౌళి శాఖ

ప్రతి మహిళకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం : జేసీ



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ఆర్థిక అక్ష్యరాస్యత వారోత్సవాల సందర్భంగా ఆర్థిక ప్రణాళిక, పొదుపు మరియు రిస్క్ మేనేజ్మెంట్, ఆర్థికవృద్ధి కోసం రుణ సదుపాయాలు అంశాలపై భారతీయ రిజర్వు బ్యాంకు ప్రచురించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి మహిళా బాధ్యాతాయుతంగా రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత సమయానికే రుణాలు చెల్లించి మంచి క్రెడిట్ స్కోర్ పొందాలన్నారు. తెలివిగా నడుచుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. ముఖ్య అవసరాలను సరిగ్గా గుర్తించాలన్నారు. నెలసరి బడ్జెట్‌ని ప్లాన్ చేసుకొని పొదుపు పాటించాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న దురాగతాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేలా ఆడపిల్లలు శారీరక మానసిక దృఢత్వం పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజె క్టు కో-ఆర్డినేటర్ నిత్యానందరాజులు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రాణి లక్ష్మీభాయి ఆత్మరక్ష శిక్షణ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ తాడేపల్లి- గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సమస్యను ఒంటరిగా ఎలా పరిష్కరించుకుని ముందుకుసాగాలి, నిరంతరం ఎలా చదువుకోవాలి అనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రధానంగా ఆడపిల్లలు 18 సంవత్సరాలు వచ్చే వరకు చదువు మానేయకుండా ప్రత్యేక శ్రద్ధతో అడుగులు వేయాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు చూడడం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో అనితా, రూపేష్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రసూల్, ఇన్‌చార్జ్ సలీం పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల వేలంతో రూ.10.50 లక్షల ఆదాయం

చక్రాయపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తలనీలాలకు, కొబ్బరి చిప్పలకు వేలం పాట నిర్వహించారు. తలనీలాలకు ఇద్దరే రావడం.. సరైన పాట పలకకపోవడంతో వాయిదా వేశారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు వాయిదా వేశారు. ఏడాది పాటు కొబ్బరిచిప్పలను పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించగా ఐదుగురు పోటీ పడ్డారు. కె.నాగరాజు అనే వ్యక్తి రూ.10.50 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చ కులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ఏపీజీబీ అధికారి అవినాష్, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

దువ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజొన్నవరం గ్రామంలో తిమ్మారెడ్డి వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి (28) అనే యువకుడు సోమవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. కాగా, సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. వివాహం జరిగి సంవత్సరం అయిందని మృతుని తండ్రి రమణారెడ్డి, బంధువులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

సోషల్ మీడియాలో వేధింపులు.. ఐదుగురిపై కేసు నమోదు

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం సోషల్ మీడియాలో వేధిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వెంకయ్య కాల్వ గ్రామానికి చెందిన మానవహక్కుల నేత రామాంజనమ్మ కొండాపురం కిరాణా షాపు యజమాని నాగరాజుకు స్థలం ఇప్పిస్తానని రూ.60,000 డబ్బులు తీసుకుంది. ఇందులో ఆమె ఇంకా రూ.10,000 నాగరాజుకు చెల్లించాల్సి ఉంది. ఈవిషయమై మూడురోజుల కిందట ఇరువురు గొడవపడ్డారు. ఈనేపథ్యంలో రామాంజులమ్మ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సోషల్ మీడియాలో నాగరాజు అతని కుటుంబసభ్యులు పోస్టు చేసి తన ప్రతిష్టకు భంగం కలిగించారని రామాంజులమ్మ పోలీసులకు ఫిర్యా దు చేసింది. ఈమేరకు నాగరాజు అతని కుటుంబసభ్యులు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

తొమ్మిది గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువపల్లెలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తొమ్మిది గడ్డివా ములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలో పశువుల మేత కోసం మైసూరారెడ్డి కాలనీకి చెందిన పామన్న, వెంకటలక్ష్మణ్, ప్రసాద్, బాలచంద్రాయుడు, గంగరాజు, రోశయ్య, లక్ష్మయ్య, అంగడిబాబు గడ్డివాములను వేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాములకు అగ్గి రాసుకుంది. పక్క పక్కనే ఉండడంతో మంటలు పెద్దఎత్తున ఎగిసి పడడంతో స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డివా ములు పూర్తిగా కాలిపోయి రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడిపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన ఓ యువతి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. కర్నూలుకు జిల్లాకు చెందిన యువకుడు అదే ఆసుపత్రిలో పనిచేస్తూ.. ప్రేమ పేరుతో యువతి వెంట తిరుగాడు. ఆ యువతి పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో మాట మార్చి నిరాకరించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయ డంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఝరి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మరుసటిరోజు జరిగే ఝరి ఉత్సవం ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో అబ్దుల్ రహీం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు తాగునీరు, పారిశుధ్యం తదితర వసతులపై సిబ్బందితో సమీక్షించారు. అలాగే సిబ్బంది ఝరి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె కొనసాగిస్తాం...



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల డీన్ ప్రసాద్

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మెను కొనసాగిస్తామని పశువైద్య కళాశాల విద్యార్థులు తేల్చిచెప్పారు. సోమవారం 22వ రోజు నిరసనలో భాగంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ప్రసాద్ వివిధ విభాగాలకు చెందిన అధికారులు సాగర్, పృథ్వి, ఓఎస్డీ కల్యాణి తదితరులు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని విద్యార్థులతో సంప్రదింపులు జరిపారు. విద్యార్థుల న్యాయపరమైన డిమాండ్లను పైస్థాయికి పంపామని.. త్వరలో ఒక నిర్ణయం వెలువడుతుందని.. సమ్మెను విరమించి తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గతంలో కూడా పశువైద్య అధికారులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హామీలతోనే సరిపెట్టారని.. తమకు ప్రభుత్వం నుంచి స్టైఫండ్ పెంచుతూ స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మెను కొనసాగిస్తామని వివరించారు.

న్యాయం జరిగే వరకు...



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గండికోట నిర్వాసితులతో సదస్సు నిర్వహించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి దాదాపు పదేళ్లు కావస్తున్న ఇంతవరకు నిర్వాసితులకు పరిహారం అందించడంలో, మౌలిక సదుపా యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీళ్లు నింపినప్పటికీ ఇంతవరకు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. గత ప్రభు త్వం నిర్వాసితులకు రూ.10లక్షల పరిహారం ఇస్తామని చెప్పి, పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా చెతులెత్తేసిందనారు. మొదటి విడత 14 గ్రామాలకు రూ.3,25,000 పరిహారం చెల్లించడంతో పాటు, రెండో విడత ఎనిమిది గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్య క్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ బాబు, రఘునాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు.

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య



హత్యకు గురైన గంగిరెడ్డి (ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరు గంగిరెడ్డి (71) సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు కొడవళ్లతో తలపై, గొంతుదగ్గర కిరాతకంగా నరికి హత్య చేశారు. వివరాల్లోకెళితే.... గంగిరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం ఉదయాన్నే తోట వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మీనారాయణమ్మ తన కుమారుడు యోగానందరెడ్డికి ఫోన్ చేసి మీనాన్న ఇంటికి రాలేదని తెలుపగా, పులివెందుల నుంచి తోటవద్దకు వచ్చి పరిశీలించగా హత్యకు గురై విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, పొక్కుపోలం రైతులు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కేతిరెడ్డి గంగిరెడ్డిలు తరచూ మాపొలంలోకి రావద్దు అని చెప్పినా వచ్చే వారని, ఈ విషయమై గట్ల వద్ద ఘర్షణ జరిగిందని, వారిపైనే అనుమానం ఉందని హత్యకు గురైన గంగిరెడ్డి కుమారుడు యోగానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ వెల్లడించారు. క్లూస్‌టీం రంగంలోకి దించి పరిశీలించారు.



హత్యకు గురైన గంగిరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమణ

అవి.. ఇవి.. అన్నీ

వైభవంగా కల్యాణోత్సవం



చిట్వేలి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మైల పల్లె చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమ వారం ఉదయం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం టీటీడీ వారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమం కల్యాణోత్సవం, గ్రామోత్సవంతో ముగిసిందని ధర్మకర్త వడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. రాయపెద్ది రాజశేఖర్‌శర్మ, కార్యక్రమాలను జరిపించారు.

గోపురం నిర్మాణానికి వితరణ



నగదును అందజేస్తున్న జయరామయ్య

సుండుపల్లె, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అగ్రహారంలో వెలిసిన శ్రీసీతారాముల ఆలయ గోపురం నిర్మాణానికి వెంకటేశ్వర జనరల్ స్టోర్ యజమాని జయరామయ్య రూ.50వేలు నగదును సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ రామాజగదీశ్, వైసీపీ నాయకులు రామక్రిష్టారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

కాకతీయ స్కూలులో తల్లికి వందనం



తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ స్కూలులో సోమవారం స్కూలు డైరెక్టర్లు ఎస్. కుమార్‌రాజు, ఎం.శ్రీను ఆ ధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లులకు పాదాలు కడిగి నమస్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెనగలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాత సింగనమల గ్రామంలో గల పురాతన మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం గుండ్లూరు ఎల్లమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నవగ్రహ దేవతల విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం కామాక్షి, మల్లేశ్వరస్వాముల కల్యాణం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాగా పాత సింగనమల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

పోస్టుకార్డు ద్వారా సీఎంకు వినతి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి సోమవారం తమ విన్నపాన్ని పోస్టు ద్వా రా తెలిపారు. మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎం.రమణ, బాలాజీ, ప్రమీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

హత్యరాల ఉత్సవ కమిటీ రద్దు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట మండల పరిధిలోని హత్యరాల కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం నియమించిన ఉత్సవ కమిటీని రద్దు చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 21న ఉత్సవ కమిటీని నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కరోజులోనే తిరిగి కమిటీని రద్దు చేశారు. కాగా ఉత్సవాల నిర్వహణ, ఎండోమెంట్‌వారు నిర్వహిస్తారా లేదా కొత్త కమిటీని మళ్లీ ఎన్నుకుని ఉత్సవాలు నిర్వహిస్తారా అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైరస్‌తో అన్నదాత విలవిల

- రూ. లక్షల్లో పెట్టుబడులు... అప్పుల్లో అన్నదాతలు
- మండల వ్యాప్తంగా వందలాది ఎకరాల సాగు
- వైరస్ దెబ్బకు తోటలు వదిలేస్తున్న రైతులు

కరువు, అప్పులతో కుదేలవుతున్న అన్నదాత వ్యవసాయ జూదంలో ఓడిపోతూనే ఉన్నాడు. ఈసారైనా.. ఈసారైనా అనుకుంటూ పంటలు సాగు చేసి అప్పుల్లో కూరుకుపోతున్నాడు. ఉద్యానవన పంటలతో లాభాలు పొందవచ్చన్న ఆశతో వందలాది ఎకరాల్లో దోస పంట సాగు చేశారు. సరిగ్గా నెల గడవకముందే అన్నదాత ఆశలు అడియాశలయ్యాయి. డ్రిప్స్, ఎల్లో మజాకాతో పూర్తి స్థాయిలో తోటలు దెబ్బతినడంతో రైతులు పీకేస్తున్నారు.



వైరస్‌తో దెబ్బతిన్న దోస పంటను పీకేస్తున్న దృశ్యం

చిన్నమండెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలకు మూలమైన వ్యవసాయ రంగం రోజు రోజుకూ నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. దీంతో పంట పెట్టాలంటేనే రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఇందులో భాగంగా దోస రైతు పరిస్థితి అధ్వానంగా మారింది. 60 రోజుల్లో పంట చేతికి వచ్చేస్తుందన్న ఆశతో అన్నదాతలు అప్పులు చేసి మరీ దోస పంట సాగు చేస్తే 60 రోజులైనా ఎరువులు, మల్చింగ్, డ్రిప్పు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు ఇలా ఎకరాకు 1.20 లక్షల నుంచి 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే తీరా చూస్తే నెల రోజులు గడవక ముందే మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలో డ్రిప్పు, ఎల్లో మజాకాతో తోటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నారు. కొందరు రైతులైతే ఎంత మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడంతో పంటలను పీకేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి అన్నదాతలు బలి



ఉద్యాన అధికారుల నిర్లక్ష్యానికి అన్నదాతలు బలవుతున్నారు. ప్రభుత్వం నుంచి వేలకు వేలు జీతాలు తీసుకుంటూ ఏసీ రూముల్లో కూర్చుని సమస్యలు పట్టించుకోవడం లేదు. మాది రైతు ప్రభుత్వమని చెప్పుకునేదే కానీ రైతుకు చేసిందేమీ లేదని ఇలా ప్రతిసారి నష్టపోతున్నా రైతు వ్యవసాయాన్ని మానేసే పరిస్థితిని ప్రభుత్వాలు తీసుకురాకూడదని అలా జరగాలంటే సంబంధిత రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమాలు కల్పించాలి. వెంటనే నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- యండపల్లి బాలకృష్ణారెడ్డి, రైతు సంఘం రాయచోటి ఏరియా ప్రధాన కార్యదర్శి

వైరస్ నివారణా మందులపై అవగాహన కల్పిస్తున్నాం

నా పరిధిలోకి చిన్నమండెం, వీరబల్లి, సుండుపల్లి, సంబేపల్లె వ స్తాయి. ఆయా మండలాల్లో పుచ్చ, దోస దాదాపు 215 ఎకరాల్లో సాగులో ఉంది. ఈ పంటలకు ఆశించే వచ్చే చీడపీడలపై రైతులకు గ్రామాల వారీగా సందర్శించి ఎటువంటి మందులను పిచికారీ చేయాలో అవగాహన కల్పిస్తున్నాం. దోస పంటను ఎక్కువగా ఎల్లో మెజాయిన్ వైరల్ ఆశిస్తోంది. ఎల్లో మజాక్ వైరస్ ఎలా వస్తుందనే దానిపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పిస్తున్నాం. - ఉద్యానశాఖ అధికారి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా





రాయచోటి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు... రాజంపేటలో నిరసన

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరాజు గంగాధర్, మంగిరి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు సో మవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు అనేక సమస్యలు న్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలన్నారు. పని భద్రత, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత లేక దుర్భరమైన జీవితాలు సాగిస్తున్నారని, అయినా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు దేవా, ఏఐటీయూసీ రాయచోటి నియోకవర్గ కార్యదర్శి బత్తల వెంకట్రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున, మహమ్మద్‌హుస్సేన్, బాలకృష్ణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రాజంపేటలో...

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షుడు గంగాధర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాజశేఖర్ రెడ్డి భవన కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేశారని, కానీ జగన్‌రెడ్డి ప్రభుత్వం దానిని రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో గాయపడిన, మృతిచెందినవారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సహాయం అందడంలేదన్నారు.సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని కోరారు. ఏఐటీయూసీ అనుబంధ జిల్లా అధ్యక్షుడు చంద్ర, కార్యదర్శి ఇ.సికిందర్, బవన నిర్మాణ కార్మికులు నరసింహులు, వెంకటయ్య, వెంకటేశ్, సుబ్రమణ్యం, హుస్సేన్, బాలక్రిష్ణ, ప్రసాద్, జామల్, రాముడు, రాము, రాహుల్ పాల్గొన్నారు.

దళిత గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం : చమర్తి



సీతారాంపురం దళితవాడలో చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఘనంగా స్వాగతం పలుకుతున్న ప్రజలు

రాజంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):దళిత గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట మండలంలోని సీతారాంపురం దళితవాడను ఆయన సందర్శించారు.సర్పంచ్ చైతన్య నాయుడి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సమస్యలను వివరించారు.

జగన్‌రెడ్డీ.. మీ నాటకాలు కట్టి పెట్టు

జగన్‌రెడ్డీ మీ నాటకాలు ప్రజలందరూ గమనిస్తున్నారని, వాటన్నింటిని కట్టిపెట్టాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి హాజరు కాకపోతే శాసనసభ్యత్వం రద్దు అవుతుందని అసెంబ్లికి వచ్చి ప్రతిపక్ష హోదా లేదని వెళ్లిపోవడమంటే మీకు పదవులంటే ఎంత వ్యామోహమో అర్థమవుతుందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శివేణుగోపాల్, పోలిచెరువు సంఘ అధ్యక్షుడు నాగేశ్వరనాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యం

సుండుపల్లె, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. సోమవారం తొగురుపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. రూ.10 లక్షలతో 222 మీటర్లు సీసీ రోడ్డు వేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు ఎల్వీ రమణ, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘ సభ్యుల సమావేశం

సిద్దవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మండల సమైఖ్య కార్యాలయంలో సోమవారం డ్వాక్రా సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు, సీఐఎఫ్ రుణాలు, రికవరీల గురించి 33 గ్రామ సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుజాత మాట్లాడుతూ లోకోయాప్‌లో లావాదేవీలు, డేటా అప్‌లోడ్ చేయాలని సమైక్య నూతన భవన నిర్మాణానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని, రుణాలు తీసుకున్న ప్రతి గ్రూపు సభ్యులు నిర్ణీత సమయంలో బ్యాంకులో జమ చేయాలన్నారు.

వైసీపీ నుంచి 200 కుటుంబాలు టీడీపీలో చేరిక



వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన కోనాపురం గ్రామస్థులు

నందలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపురంలో ఉన్న వైసీపీ నాయకులు ఆనంద, తిరుపాల్, వారి అనుచరులు మండల మాజీ ఎంపీపీ భువనబోయిన లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో దాదాపు 200 కుటుంబాల వారు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కోనాపురం గ్రామంలో 300 పైబడి ఓట్లు టీడీపీకి మైనస్ అయ్యాయన్నారు. దీన్ని అధికమించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నారా లోకేశ్‌ను సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టంగుటూరు ఎంపీటీసీ పెంచలయ్య, సర్పంచ్ మైనుద్దీన్, టీడీపీ నాయకులు చుక్కా యానాది, కోనాపురం ఉపసర్పంచ్ పుల్లయ్య, ఇబ్రాయిల్, నార్ల పెంచలయ్య, గుజ్జుల ఈశ్వరయ్య, శ్రీనివాసులరెడ్డి, చిన్నఎల్లయ్య, పెద్ద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



అధికారులు లేకపోవడంతో కార్యాలయ తలుపు వద్ద వినతిపత్రం ఉంచుతున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మొగిలి వినయ్, ప్రధాన కార్యదర్శి ఎం. జయరామయ్య, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఇరిగేషన్ శాఖ కార్యాలయం వద్ద ఏ అధికారి లేకపోవడంతో తలుపునకు వినతిపత్రం అందించారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంకటరమణ, గోపాల్ పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

రాయచోటి(కలెక్టరేటల్), ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఏపీ 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజు కోరారు. 108 ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ వారి సేవలను, సర్వీసును పరిగణలోకి తీసుకొని స్లాబ్ అప్గ్రేడేషన్‌ను ఆర్‌ఎఫ్‌పీలో చేర్చడం లేదా కొత్త సర్వీస్ ప్రొవైడర్ 108 సర్వీసులను చేపట్టే తేదీని కాకుండా 15-8- 2025వ తేదీన ప్రమాణికంగా తీసుకొని స్లాబ్ ఫిక్సేషన్ చేయాలన్నారు. 108 ఉద్యోగులు రామాంజులు, చంద్రబాబు, బాలాజీ, రవిప్రకాశ్, గోపాల్‌రాజు, దయానంద్, అన్వర్‌బాషా, ప్రసాద్‌బాబు,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకుందాం



మాట్లాడుతున్న క్షయవ్యాధి నివారణ అధికారి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకుందాం అని క్షయవ్యాధి నివారణ అధికారి హరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి రోగి దగ్గినపుడు, తుమ్మినపుడు, క్రిముల ద్వారా ఇతరకులకు వ్యాపిస్తుందన్నారు. అంగన్వాడీ వర్కర్లు, లేదా ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లను వ్యాధిగ్రస్తుల వివరాలు తెలియజేస్తే వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారన్నారు.

ఇసుకాసురుల బారినుంచి ఓబిలి ప్రజలను రక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల బారినుంచి ఓబిలి ప్రజలను రక్షించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఓబలి మాజీ సర్పంచ్ హరీష్‌బాబు సోమవారం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. చెయ్యేరు నది నుంచి రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లు, ఎడ్లబండ్ల ద్వారా తరలిస్తుండటంతో దుమ్మూధూళి, శబ్దకాలుష్యం వల్ల స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. డిష్ కరిముల్లా, సుబ్బయ్య, సీపీఐ మండల కార్యదర్శి జి.ఆదినారాయణ, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు పి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకోండి: తహసీల్దార్

గాలివీడు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల భూ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగులు భూములు, మ్యుటేషన్, చుక్కల పట్టా భూములు, వన్‌బీ, అడంగల్ వంటి భూ సమస్యలు ఎక్కువగా తమ దృష్టికి వస్తున్నాయని, ఇవే కాకుండా ఇన్కమ్, క్యాస్ట్, ఫ్యామిలీ మెంబర్ వంటి సర్టిఫికెట్లు కూడా ఎప్పటిప్పుడు క్లారిఫై చేస్తున్నామని తెలిపారు. సమస్యలను వెంటనే వీఆర్‌వోలు, సర్వేయర్లకు తెలియజేసి వాటిని గడువులోగా పరిష్కరించాలని, వారికి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ వేధింపులపై త్వరలో మౌనదీక్ష

చిన్నమండెం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ వేధింపులపై త్వరలో మౌనదీక్ష చేపట్టినున్నట్లు బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మల్లూరు రెడ్డివరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి ఒకరిదైతే పరిహారం ఇంకొరికి చెల్లించారన్నారు. తప్పులు సరిదిద్దమని అడుగుతుంటే నెలల తరబడి తిప్పుకుంటున్నారన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

సంబేపల్లె, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన ఇడగొట్టు రెడ్డెప్ప (65) టీడీపీ కార్యకర్త సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వివిధ ప్రాంతాల్లో చికిత్స పొందినట్లు తెలియజేశారు. సోమవారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలియజేశారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఇడగొట్టు రెడ్డెప్ప మృతి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు తిక్కం భయ్యారెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రెడ్డెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్డెప్ప మృతి పార్టీకి తీరనిలోటని తెలియజేశారు. ఈ విషయాన్ని స్థానిక మంత్రి ద్వారా పార్టీకి తెలియజేసి వారి కుటుంబానికి పార్టీ సహకారం అందేలా చూస్తామని తెలియజేశారు.

వైభవంగా పుల్లయ్య స్వామి ఊరేగింపు

సిద్దవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ బాకరాపేటలో వెలసిన జగద్గురు పుల్లయ్యస్వామి 29వ ఆరాధన సందర్భంగా సోమవారం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి బాకరాపేట గ్రామంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

జిల్లాస్థాయిలో సత్తా చాటిన రాజంపేట చిన్నారులు



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమి క్రీడాకారులు పతకాలు సాధించి సత్తా చాటినట్లు అకాడమి గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునీత్, ఏమ్, భగత్, సాహిత్, ప్రతీక్ స్వర్ణపతకాలు, లాలిత్, లోహిత్, కోమల్, కార్తీక్‌లు రజత పతకాలు సాధించారన్నారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల ఆత్మరక్షణ ఆరోగ్యంతో పాటు పదునైన మేదోశక్తి లభిస్తుందన్నారు. గెలుపొందిన వారికి జీఎంసీ క్లబ్ ఆవరణంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడామి ఉపాధ్యక్షుడు, భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం, నరసింహా, కరాటే మాస్టర్ కె.గంగారామ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మార్షల్ ఆర్ట్స్ సభ్యులు

వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సహాయం

సిద్దవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన జింక సాంబయ్య సతీమణి జింకా విజయ గత పదేళ్ల నుంచి కాలేయ వ్యాధితో బాధపడుతోంది. చికిత్సకు సరిపడా డబ్బు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజంపేట జనసేనపార్టీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ 2 నెలలకు సరిపడా మందుల కొరకు రూ.5 వేలు సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య చేతులమీదుగా బాధితురాలికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకోట్ల శివాజి, వినయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా స్కూల్ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీవో

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడులోని కస్తూర్బా విద్యాలయాన్ని ఎంపీడీవో మల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై ఆరా తీశారు. ఇంటర్ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సహస్ర కలశాభిషేకం

కలికిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. మాఘమాసం చివరి ఏకాదశి సోమవారం కావడంతో శివరాత్రి పర్వదినానికి అంకురార్పణ కోసం ఈ కలశాభిషేకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నపత్రాలు

పీలేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం పీలేరు పోలీసుస్టేషన్‌కు చేరాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డప్ప, జి.బీటీ కరుణ విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలంలో ఇంటర్ పరీక్షల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, చిత్తూరు మార్గంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాన్ని పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. మార్చి 1న ప్రథమ, 3న ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు సూచించారు.



పీలేరు పోలీసుస్టేషన్‌లో ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్లు

ఝురీ స్నానం..

సర్వ పాపహరణం



● మహాశివరాత్రికి సిద్ధమవుతున్న శివాలయాలు

మహా శివరాత్రి సందర్భంగా కలకడ సమీపంలోని సత్యవతి, బాహుదా నదుల సంగమం వద్ద పుణ్యస్నానాలకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రామసముద్రం మండలంలోని వాలీశ్వరాలయ రథోత్సవానికి కొత్త తేరు సిద్ధమైంది

కలకడ,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహా శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే ఝురి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. కలకడకు తూర్పున దాదాపు 6కిలో మీటర్ల దూరంలో సత్యవతి, బాహుదా నదుల సంగమంతో ఏర్పడే ఈ ఝురిలో మునిగితే సర్వపాపాలు హరించుకుపోయి పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహా శివరాత్రి జాగరణ అనంతరం ఝురికి చేరుకొని పుణ్యస్నానాలాచరిస్తారు. రాయలసీమ జిల్లాల నుంచేకాక హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర నగరాల నుంచి వేలాదిగా తరలి వస్తారు. స్నానాలు చేసేటప్పుడు, తోపులాట జరిగినపుడు భక్తులు నీటిలో పడిపోకుండా ఆలయ నిర్వాహకులు తాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఝురి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం పీలేరు, మదనపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల్ని రెండు మార్గాల్లో పంపుతారు.



కలకడ సిద్దేశ్వరాలయం

బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

కామాక్షీ సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా చేస్తున్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తలనీలాలు సమర్పించే భక్తులు స్నానాలారించేందుకు పుష్కరిణిలో నీరుంది. మహా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలో ఎర్రయ్యగారిపల్లె వద్ద ఉన్న ఆర్చి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

శివాలయాలకు నెలవు పీలేరు

పీలేరు, ఫిబ్రవరి 24: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయం, మండలంలోని శివరామాపురం భ్రమరాంబ మల్లికా ర్జున స్వామి ఆలయం, జంగంపల్లె లోని వీరభద్ర, అడవి పల్లెలోని గుం డాల మల్లేశ్వర స్వామి ఆలయాలు మ హాశివరాత్రి పర్వదినానికి ముస్తాబ య్యాయి.





శివరామాపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి.. అడవిపల్లెలోని గుండాల మల్లేశ్వర స్వామి ఆలయం

సూర్యకిరణాలతో అభిషేకం..

పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని ప్రతి మాఘ మాసంలో సూర్యకిరణాలు స్పర్శిస్తుం టాయి. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా పందిళ్ల ఏర్పాటు, శుక్రవారం అంకురార్పణ చేశారు.

శ్రీశైలం తరహాలో..

దొడ్డిపల్లె పంచాయతీలోని శివరామాపురం లోని గార్గేయ నదీ ఒడ్డున ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం శ్రీశైలంలోని ఆలయాన్ని తలపిస్తుంది. శ్రీ శైలం వెళ్లలేని వారి కోసం పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించారని తెలుస్తోంది. ప్రతి శివ రాత్రికి ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

భళా.. వీరభద్రా..

వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని వీరభద్ర స్వామిని ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. సమస్యలతో బాధపడే వారు వీరభద్రుడిని నమ్ముకుంటే తప్పక కాపాడతాడని జంగంపల్లె వాసుల విశ్వాసం. ఈ ఆలయంలో ఆలయానికి అనుబంధంగా జమ్మి చెట్టు ఉండడంతో పీలేరుతోపాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కార్తీక మాసంలో వీరభద్రుడిని పెద్దసంఖ్యలో దర్శించుకుంటారు. శివయ్య భక్తులతోపాటు అయ్యప్పస్వామి భక్తులు కూడా ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.

ప్రకృతి ఒడిలో గుండాల మల్లేశ్వరుడు

పీలేరు మండలం తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న అటవీ ప్రాంతంలో వెలసిన గుండాల మల్లేశ్వరుడు సంతాన లేమితో బాధపడే వారికి సంతానాన్ని ఒకసే కల్పతెరువుగా విరాజిల్లుతున్నాడు. అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య సేద తీరే మల్లేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, శివరాత్రి సందర్భంగా జాతర జరుగుతుంటాయి. కార్తీక మాసంలో ఆయనను దర్శించుకుని ఏదైనా మొక్కుకుంటే శివరాత్రి వచ్చేలోపు ప్రసాదిస్తాడని భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా రెండు రోజులపాటు అడవిపల్లెలో జాతర జరుగుతుంది. ఆ జాతర కోసం ఇటీవల నూతనంగా నియమితులైన ఉత్సక కమిటీ సభ్యులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వాలి ప్రతిష్ఠించిన శివలింగం..

రామసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాలీశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవు తోంది. ఆర్.నడింపల్లె పంచాయతీ బలసంద్రం గ్రామ సమీపంలోని కొండపై ఉన్న ఈ ఆలయాన్ని చోళ రాజుల హయాంలో ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న పుంగనూరు దొరవారు నిర్మించా రని చెబుతారు. కాగా ఈ ఆలయంలోని శివుడు వాలీశ్వరస్వామిగా పేరు పొందడానికి కారణాన్ని ఇలా వివరిస్తారు



త్రేతాయుగంలో వానర రాజైన వాలి తన జోలెలో ఒక శివ లింగాన్ని ఉంచుకుని వనసంచారం చేసేవాడట. ఈ క్రమంలో బలసంద్రం వద్దనున్న కొండ మీదకు చేరుకున్న ఆయన రాత్రి కావడంతో తన జోలెలోని శివలింగాన్ని తీసి ఒకచోట ఉంచి పూజలు చేసిన అనంతరం నిద్రించాడు. ఉదయం శివ లింగాన్ని తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అది కదలకపోవడంతో, ఆరోజు కూడా కొండపైనే నిద్రించాడు. ఆ రాత్రి శివుడు వాలికి కలలో కనిపించి తాను ఈ కొండలోనే ఉంటానని తనను తీసుకె ళ్లడానికి ప్రయత్నించవద్దని చెప్పాడట. అలా వాలి వలన వెలసిన శివుడు కావడంతో వాలీశ్వరస్వామి అని పేరు వచ్చిందని చెబుతారు. ప్రతి ఏటా మహాశివరాత్రికి ఇక్కడ రెండు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

శివరాత్రికి లక్షల్లో భక్తులు.. : వాలీశ్వరస్వామి కొండకు రోడ్డుమార్గం సుగమం కావడంతో ఈ సారి శివరాత్రి వేడుకలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు అంటున్నారు. రథోత్సవం కోసం నూతన తేరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కల్యాణం.. చూతము రారండి..

● మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మల్లయ్యకొండ

● 71 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. 25వ తేదీ మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 26వ తేదీ తెల్లవారు జాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, సహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు స్వామి వారి మెరవణి నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి : భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా కొండపైన క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులు ఎండబారిన పడకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొండపైన నీటి సమస్య తలెత్తకుండా నూతన బోరు వేశారు. రాత్రి సమయాల్లో కొండకు ఎక్కే భక్తులకు ఇబ్బంది లేకుండా ఘాట్ రోడ్డు పొడవునా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు 71 ఆర్టీసీ బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం వెంకట్రమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి 20 బస్సులు, తంబళ్లపల్లె (రాగిమాను కూడలి) నుంచి 10, బి.కొత్తకోట, ములకల చెరువు, పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, అక్కడి నుంచి కొండపైకి 35 బస్సుల చొప్పున నడపనున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో మునిరాజ తెలిపారు సులభంగా దర్శనం అయ్యేలా చలువ పందిళ్లతో రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశామని, కొండపైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామఅని తెలిపారు.

భూ ఆక్రమణ యత్నం అడ్డుకోండి

● కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

కురబలకోట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని స్పోర్ట్ అలియాస్ గండు గండు రాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సోమవారం కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ముంబై-చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వేనెంబర్ 220లో తాము కొనుగోలు చేసి భూమిని అనంతపురాన్ని చెందిన నేతలు భూమిని ఆక్రమించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తమకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక నేతలు ఈ వివాదంలో తలదూర్చుతున్నారన్నారు.

గతంలో ఈ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు నిషేధాజ్ఞలు విధించారని, ఈ భూమికి మళ్లీ అదే విధంగా రక్షణ కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు త భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహారిగోడను కూల్చివేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమికి రక్షణ కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సంతకాలు లేకుండానే బిల్లుల చెల్లింపు?

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతం

● ఒక టీఏ, నలుగురు ఎఫ్ఏలకు జరిమానా

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంతకాలు లేకుండానే ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించిన వైనం సామాజిక తనిఖీ సమావేశంలో వెలుగులోకి వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 18వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. రూ.7.47 కోట్లతో 486 పనులు చేయగా ఇందులో కూలీల వేతనాలకు రూ.5.85 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.62 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా పనుల నిర్వహణ, నిధుల దుర్వినియోగం కింద కేవలం రూ.8639 రికవరీకి ఆదేశించడం విశేషం. బాలయ్యగారిపల్లె పంచాయితీలో 8 ఇంకుడు గుంతల పనికి రూ.42,128 ఖర్చు చేయడంపై డీఈ నేతృత్వంలో విచారణకు నిర్ణయించారు. పండ్ల తోటల పథకం కింద లబ్ధిపొంది, మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపని 21 మందికి నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఓ టెక్నికల్ అసిస్టెంట్, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధించారు. అనంతరం పీడీ వెంకటరత్నం కార్యాలయ సమావేశ ప్రాంగణంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కరువు ప్రాంతమైన కలకడ మండలంలో కూలీలకు 150 పని దినాలు కల్పించాలని ఆదేశించారు. ఫారంపాండ్లు, ఇంకుడు గుంతల పనులను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఎస్ఆర్పీ సుబ్బారావు, ఏపీవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్టు


రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌లో గత నెల 24 న జరిగిన ఆటో చోరీ కేసులో తిరుపతి పట్టణంలోని జీవకోన గాంధీ కాలనీకి చెందిన చిన్నం గారి షణ్ముగంను అరెస్టు చేసినట్లు రైల్వే కోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. మండలంలోని జంగిటివారిపల్లికు వెళ్లె మార్గంలో ఆటోలో పారిపోతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారు, ఆటో ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని మాధవరం గ్రా మం శీతల గంగమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప నుంచి చాముండేశ్వరిపేటకు వస్తున్న ఆటో, తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్‌కే నగర్‌కు చెందిన కృష్ణయ్య (68) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కారు ఆగకుండా కడప వైపు వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు.

500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు దగ్ధం

ములకలచెరువు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువుకు సమీపంలో ఉన్న కనుగొండకు సోమవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు 500 ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు అగ్నికి ఆహుతైంది. మంటలు భారీగా ఎగసి చుట్టు పక్కల వ్యాపించాయి. విలువైన ఔషధ మొక్కలు, పశు గ్రాసంతో పాటు వన్య ప్రాణులు మంటల బారిన పడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే మంటలు కొండపైకి వ్యాపించాయి. దీంతో కొండ పైకి వెళ్లేందుకు వీలు కాలేదు. మంటలు కొండంతా వ్యాపిస్తే వేల ఎకరాల్లో అడవికాలిపోయే ప్రమాదం ఉంది.



అగ్నికి ఆహుతవుతున్న కనుగొండ అటవీ ప్రాంతం

ఎర్రగొండకు నిప్పు

● కంది, మిరప పైర్లు వ్యవసాయ సామగ్రి బుగ్గిపాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగొండ అటవీ ప్రాంతంలో ఆదివారం మంటలు రేగడంతో, సమీపంలో ఉన్న పొలాలకు నష్టం వాటిల్లింది. అటవీ భూమికి ఆనుకొని ఉన్న సంబేపల్లెకు చెందిన రైతు వెంకటేశ్వర్లు పొలంలో ఉన్న 700 టమోటా కట్టె, స్టార్టర్ బాక్సు 6 స్ప్రింకర్ పైపులు కాలిపోయాయి. దాసరివాండ్లపల్లె రైతు నాగేశ్వరకు చెందిన రెండు ఎకరాలకు కంది పైరు కాలిపోగా, రామాంజులుకు చెందిన మిరప పైరు వాడిపోయింది. తమకు కలిగిన నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



ఎర్రగొండకు నిప్పంటుకోవడంతో కాలిపోయిన కందిపైరు

'నాటుసారా రహిత సమాజం వైపు అడుగులు వేద్దాం'

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత సమాజం వైపు అడుగుల వేయాలని తహసీల్దార్ అమరనాథ్, ఎస్ఐ తిప్పేస్వామి, ఎక్సైజ్ ఎస్ఐ మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నిమ్మనపల్లి పంచాయతీ నాగులయ్యగారిపల్లిలో నాటుసారా వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా అమ్మడం, తాగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నాటుసారా ధర తక్కువగా ఉండటం వలన ఎంతోమంది దీనికి బానిసలవుతున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. నాటుసారా లేని సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, మల్లప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు



నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిట్స్ కాలేజీలో సక్సెస్ మీట్



కేక్ కట్ చేస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

రాయచోటి, ఫిబ్రవరి 24: జేఎన్‌టీయూ అనంతపురం వారు విడుదల చేసిన ఫస్ట్ ఇయర్ సెమిస్టర్‌లో బిట్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో పఠాన్ సాజిదాఖానమ్, సీఎస్‌సీ 87.5 శాతం కైవసం చేసుకుని యూనివర్సిటీ టాపర్ల జాబితాలో నిలిచారు. అలాగే ఏఐలో సాయిదర్శిని 80.8 శాతం సాధించారు. అలాగే మరో 20 మంది విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువగా, 30 మంది 70శాతం కన్నా ఎక్కువగా మార్కులు సా ధించారు. కళాశాల స్థాపకుడు మన్సూరు భాస్కర్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాలేజీ స్థాపించిన అనతి కాలంలోనే ఇంత విజయం సాధించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.

సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్ నిలిపివేయాలి

పీలేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు జూనియర్ సివిల్ జడ్జిల నియామక నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని మాదిగల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపోగు శ్రీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యేంత వరకు టీచర్ల భర్తీని నిలిపి వేసిన ప్రభుత్వం జూనియర్ సివిల్ జడిల నియామక ప్రక్రియను కూడా నిలిపి వేయాలన్నారు. హైకోర్టు ఇటీవల వెలువరించిన జడ్జిల నియామక నోటిఫికేషన్‌లో ఎస్సీలకు వర్గీకరణ చూపకుండా కేవలం 4 ఖాళీలు చూపిందన్నారు. మొత్తం 50ఖాళీలు ఉండగా ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ మేరకు 8 పోస్టులు రావాలన్నారు. వర్గీకరణ లేకపోవడంతో ఆ పోస్టులు కూడా మాలలకు దక్కే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై దృష్టి సారించి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



సాయం కోసం...

- చేనేతల ఎదురుచూపులు
- 110 సొసైటీలకు అందని ఉపశమనం
- కోట్ల రూపాయల నాబార్డ్ నిధులు హోల్డ్‌లో
- సీఐడీ కేసులను బూచిగా చూపుతున్న అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధుల కోసం చేనేతలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నా రు. కేంద్ర ప్రభుత్వం 80శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20శాతం నిధులు కేటాయించి పునరుద్ధరణ సంస్కరణ పునర్నిర్మాణం (ఆర్ఆర్ఆర్) పథకం కింద నాబార్డు ద్వారా సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో 2013లో చేనేత, జౌళిశాఖ అధికారులు ఉమ్మడి కడప జిల్లాలో నష్టాల్లో కూరుకుపోయిన చేనేత సంఘాలను తిరిగి పునరుద్ధరించేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు నాబార్డు నుంచి రూ.13.68 కోట్లు జిల్లాలోని 110 చేనేత సహకార సొసైటీలకు మంజూరైంది. ఇందుకు సం బంధించి 2020 సెప్టెంబరు 25వ తేదీ నిధులు విడుదల చేశారు. ఇందులో 15 సంఘాలకు సంబంధించిన రూ.1.97 కోట్ల పాత బకాయిలను బ్యాంకు అధికారు లు జమ వేసుకున్నారు. మిగిలిన సంఘాలకు సంబంధించి రూ.11.19 కోట్లు నిధులు ఇప్ప టికీ విడుదల చేయకపోవడంతో నాబా ర్డు ఉద్దేశం నీరుగారపోతోందని చేనేత సంఘాల ప్రతినిధు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది



చేనేత సహకార సొసైటీలకు నాబార్డు ద్వారా అందిన రుణా న్ని లబ్ధిదారులు పొందేలా సహకరించాలి. నాబార్డు ఎలాంటి ఆంక్షలు విధించకున్నా ఏదో ఒక కారణం చెబుతూ ఇక్కడ అధికార యంత్రాంగం ఇబ్బంది పెడుతోంది. అన్ని సొసైటీలకు అందిన రుణాన్ని ఇచ్చేందుకు అభ్యంతరం చెబుతున్న అధికారులు బ్యాంకుకు బకాయి ఉన్న సొసైటీల రుణాలను ఏ విధంగా సర్దుబాటు చేసుకున్నారు.

- అవ్వారు మల్లికార్జున, బీసీ నేత

పాత అప్పులోకి జమ

నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలను ఆదుకునేందుకు నాబార్డు సాయమందిస్తే పాత అప్పులోకి రూ.1.97 కోట్లు డీసీసీబీ అధికారులు జమ వేసుకున్నట్లు సమాచారం. ఇందులో కొండమా చుపల్లె వీవర్స్ కోఆరేటివ్ సొసైటీ రూ.12.37లక్షలు, మారుతీ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ దత్తాపురం రూ.17.40 లక్షలు, జమ్మల మడుగుకు చెందిన శ్రీభార్గవమ్మ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.16.92లక్షలు, వేపరాలకు చెందిన శ్రీచౌడేశ్వరి సొసైటీ రూ.24.95లక్షలు, అప్పనపల్లె మహిళా కోఆపరేటివ్ సొసై టీ రూ.11.97లక్షలు, కోనరాజుపల్లె సొసైటీ రూ.6.5లక్షలు, తిరువెంగళా పురం సొసైటీ రూ.19.70లక్షలు, జమ్మలమడుగులోని శ్రీహరి వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.6.61లక్షలు పాతబకాయి కింద జమ అయ్యాయి. అదేవిధంగా ప్రొద్దుటూరుకు చెందిన లతా వీర్స్ కోఆపరేటివ్ సొసైటీ రూ.4.31లక్షలు, శ్రీవేంకటేశ్వర సొసైటీ రూ.39.57లక్షలు, మోరగుడికి చెందిన తిరుమల సొసైటీ రూ.19.58 లక్షలు, శిరీష సొసైటీ రూ.8.14లక్షలు డీసీసీ బ్యాంకు పాత బకా యిల్లోకి సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది.

సాయం కోసం అగచాట్లు

ముందుగా నాబార్డు నిధులు విడుదలైన తర్వాత వాటిని పంపిణీ చేయకుండా తిరిగి నాబార్డుకు పంపించినట్లు సమాచారం. అయి తే చేనేత కార్మికులు, నాయకులు కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి తిరిగి నాబార్డు సాయాన్ని పొందినట్లు చెబుతున్నారు. ఇక సాయం అందుతుందని ఎదురుచూసే సమయంలో చేనేత జౌళి శాఖ అధికారులు ఈ సాయాన్ని ఆపాలంటూ బ్యాంకు అధికారు లకు లెటర్ ఇవ్వడంతో నాబార్డు రుణం తమకు దక్కకుండా పోయిందంటున్నారు. చేనేత జౌళిశాఖ అధికారులు కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారని.. పలు సొసైటీలపై సీఐడీ విచారణ పెండింగ్‌లో ఉందని బ్యాంకుకు లెటర్ రాయడంతోనే తమకు సాయం నిలిచిపోయిందని వివరిస్తున్నారు. ప్రస్తుతం ట్రిపుల్‌ఆర్ విడుదలైన జాబితాలో ఉన్న మోరగుడికి చెందిన శ్రీతిరుమల వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ, ప్రొద్దుటూరుకు చెందిన గాంధీరోడ్డు వీవీర్స్ కోఆపరేటివ్ సొసైటీ, శిరీష వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి మాత్రమే సీఐడీ విచారణ జరుగుతున్నట్లు తెలు స్తోంది. ఈ సొసైటీలు ఆప్కోకు లివరీ సరఫరా చేశారంటూ ఆప్కో అధికారులు సీఐడీకి ఆ సొసైటీలకు సంబంధించిన రికార్డులను అందజేసినట్లు తెలుస్తోంది. కానీ దీన్ని సాకుగా చూపి మిగిలిన సొసైటీలకు కూడా నాబార్డు రుణం అందకుండా చర్యలు తీసుకోవ డంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న చేనేత సహకార సంఘాలు మరిం తగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని సంఘాలకు ట్రిపుల్‌ఆర్ పథకాన్ని అమలు చేసిన అధికారులు తమ సంఘాలకు కూడా నాబార్డు సాయాన్ని అందించాలంటూ చేనేత శాఖ అధికారులతో పాటు కలెక్టర్లను కూడా పలు దఫా లుగా కలిసి వినతిప త్రాలు అందజేస్తున్న ప్పటికి నేతన్నలకు ఫలితం దక్కలేదు.

చర్యలు తీసుకుంటాం..

కడప జిల్లా నుంచి రికార్డులు తెప్పించుకుంటున్నాము. అక్కడి సమ స్యను పరిశీలించి చేనేత సహకార సంఘాలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్, అదనపు సంచాల కులు చేనేత జౌళి శాఖ

ప్రతి మహిళకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం : జేసీ



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ఆర్థిక అక్ష్యరాస్యత వారోత్సవాల సందర్భం గా ఆర్థిక ప్రణాళిక, పొదుపు మరియు రిస్క్ మేనేజ్మెంట్, ఆర్థికవృద్ధి కోసం రుణ సదుపాయాలు అంశాలపై భారతీయ రిజర్వు బ్యాంకు ప్రచురించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి మహిళా బాధ్యాతాయుతంగా రుణాలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత సమయానికే రుణాలు చెల్లించి మంచి క్రెడి ట్ స్కోర్ పొందాలన్నారు. తెలివిగా నడుచుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటిం చాలన్నారు. ముఖ్య అవసరాలను సరిగ్గా గుర్తించాలన్నారు. నెలసరి బడ్జెట్‌ని ప్లాన్ చేసుకొని పొదుపు పాటించాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల వేలంతో రూ.10.50 లక్షల ఆదాయం

చక్రాయపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థా నంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తల నీలాలకు, కొబ్బరి చిప్పలకు వేలం పాట నిర్వహించారు. తలనీలాలకు ఇద్దరే రావడం.. సరైన పాట పలకకపోవడంతో వాయిదా వేశారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు వాయిదా వేశారు. ఏడాది పాటు కొబ్బరిచిప్పలను పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించగా ఐదుగురు పోటీ పడ్డారు. కె.నాగరాజు అనే వ్యక్తి రూ.10.50 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చ కులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ఏపీజీబీ అధికారి అవినాష్, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

దువ్వూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజొన్నవ రం గ్రామంలో తిమ్మారెడ్డి వెంకట సునీల్‌కుమార్‌రెడ్డి (28) అనే యు వకుడు సోమవారం అనుమానాస్ప దస్థితిలో మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. కాగా, సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబా దులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. వివాహం జరిగి సంవత్సరం అయిం దని మృతుని తండ్రి రమణారెడ్డి, బంధువులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

సోషల్ మీడియాలో వేధింపులు.. ఐదుగురిపై కేసు నమోదు

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం సోషల్ మీడియాలో వేధిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వెంకయ్య కాల్వ గ్రామానికి చెందిన మానవహక్కుల నేత రామాంజనమ్మ కొండాపురం కిరాణా షాపు యజమాని నాగరాజుకు స్థలం ఇప్పిస్తానని రూ.60,000 డబ్బులు తీసుకుంది. ఇందులో ఆమె ఇంకా రూ.10,000 నాగరా జుకు చెల్లించాల్సి ఉంది. ఈవిషయమై మూడురోజుల కిందట ఇరు వురు గొడవపడ్డారు. ఈనేపథ్యంలో రామాంజులమ్మ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సోషల్ మీడి యాలో నాగరాజు అతని కుటుంబసభ్యులు పోస్టు చేసి తన ప్రతి ష్ఠకు భంగం కలిగించారని రామాంజులమ్మ పోలీసులకు ఫిర్యా దు చేసింది. ఈమేరకు నాగరాజు అతని కుటుంబసభ్యులు మరో నలు గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

తొమ్మిది గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ పల్లెలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని తొమ్మిది గడ్డివా ములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలో పశువుల మేత కోసం మైసూ రారెడ్డి కాలనీకి చెందిన పామన్న, వెంకటలక్ష్మణ్, ప్రసాద్, బాలచెం ద్రాయుడు, గంగరాజు, రోషయ్య, లక్షుమయ్య, అంగడిబాబు గడ్డివా ములను వేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు గడ్డివాములకు అగ్గి రాసుకుంది. పక్క పక్కనే ఉం డడంతో మంటలు పెద్దఎత్తున ఎగిసి పడడంతో స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డివా ములు పూర్తిగా కాలిపోయి రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడిపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన ఓ యువతి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. కర్నూలుకు జిల్లాకు చెందిన యువకుడు అదే ఆసుపత్రిలో పనిచేస్తూ.. ప్రేమ పేరుతో యువతి వెంట తిరుగాడు. ఆ యువతి పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో మాట మార్చి నిరాకరించాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయ డంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీ సులు తెలిపారు.

ఝరి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మరుసటిరోజు జరిగే ఝరి ఉత్సవం ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో అబ్దుల్ రహీం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు తాగునీరు, పారిశుధ్యం తది తర వసతులపై సిబ్బందితో సమీక్షించారు. అలాగే సిబ్బంది ఝరి వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె కొనసాగిస్తాం...



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల డీన్ ప్రసాద్

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్టైఫండ్ పెం చుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మె ను కొనసాగిస్తామని పశువైద్య కళాశాల విద్యార్థులు తేల్చిచెప్పా రు. సోమవారం 22వ రోజు నిరసనలో భాగంగా విద్యార్థులు కళా శాల ఆవరణలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ సంద ర్భంగా కళాశాల డీన్ ప్రసాద్ వివిధ విభాగాలకు చెందిన అధికా రులు సాగర్, పృధ్వి, ఓఎస్‌డీ కల్యాణి తదితరులు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని విద్యార్థులతో సంప్రదింపులు జరిపారు. విద్యార్థు ల న్యాయపరమైన డిమాండ్లను పైస్థాయికి పంపామని.. త్వరలో ఒక నిర్ణయం వెలువడుతుందని.. సమ్మెను విరమించి తరగతుల కు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు మా ట్లాడుతూ గతంలో కూడా పశువైద్య అధికారులు, ఉన్నతాధికారు లు, ప్రజాప్రతినిధులు హామీలతోనే సరిపెట్టారని.. తమకు ప్రభు త్వం నుంచి స్టైఫండ్ పెంచుతూ స్పష్టమైన జీవో వెలువడే వరకు సమ్మెను కొనసాగిస్తామని వివరించారు.

న్యాయం జరిగే వరకు...



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

కొండాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గండికోట నిర్వాసితులతో సదస్సు నిర్వహించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి దాదాపు పదేళ్లు కావస్తున్న ఇంతవరకు నిర్వాసితులకు పరిహారం అందించడంలో, మౌలిక సదుపా యా లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రాజె క్టులో పూర్తిస్థాయిలో నీళ్లు నింపినప్పటికీ ఇంతవరకు నిర్వాసితు లకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. గత ప్రభు త్వం నిర్వాసితులకు రూ.10లక్షల పరిహారం ఇస్తామని చెప్పి, పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించకుండా చెతులెత్తేసిందనారు. మొదటి విడత 14 గ్రామాలకు రూ.3,25,000 పరిహారం చెల్లించడంతో పాటు, రెండో విడత ఎనిమిది గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో రైతు సంఘం జిల్లా అధ్య క్షుడు ఎంపీ సుబ్బారెడ్డి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ బాబు, రఘునాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి న్యాయం చేయా లని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికా రులను ఆదేశించారు.

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యా దుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమ యంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించా రు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య



హత్యకు గురైన గంగిరెడ్డి (ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లె గ్రామానికి చెందిన పప్పూరు గంగిరెడ్డి (71) సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు కొడవళ్లతో తలపై, గొంతుదగ్గర కిరాతకంగా నరికి హత్య చేశారు. వివరాల్లోకెళితే.... గంగిరెడ్డి రోజుమాదిరిగానే సోమవారం ఉదయాన్నే తోట వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మీనారా యణమ్మ తన కుమారుడు యోగానందరెడ్డికి ఫోన్ చేసి మీనాన్న ఇంటికి రాలేదని తెలుపగా, పులివెందుల నుంచి తోటవద్దకు వచ్చి పరిశీలించగా హత్యకు గురై విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కాగా, పొక్కపొలం రైతులు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కేతిరెడ్డి గంగిరెడ్డిలు తరచూ మాపొలంలోకి రావద్దు అని చెప్పినా వచ్చే వారని, ఈ విషయమై గట్ల వద్ద ఘర్షణ జరిగిందని, వారిపైనే అనుమానం ఉందని హత్యకు గురైన గంగిరెడ్డి కుమారుడు యోగానందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణ వెల్లడించారు. క్లూస్‌టీం రంగంలోకి దించి పరిశీలించారు.



హత్యకు గురైన గంగిరెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమణ



పోలీసుల కస్టడీలో ఇంటర్ ప్రశ్నపత్రాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి మదనపల్లెలోని 11 కళాశాలల్లో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు సోమవారం మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లకు చేరాయి. వీటికి కస్టోడియన్‌లుగా వెంకటరమణ, శివపార్వతి, శివారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్లో భద్రపరిచి పరీక్షల సమయంలో ఆయా కళాశాలలకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో క్రిష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థి దశ మలుపు తిరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత విద్యకు దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, హెచ్‌ఎం రామచంద్ర, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి 'నవోదయం'

ములకలచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమం ఈనెల 28వ తేదీ నుంచి జరుగుతుందని ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. 28న బండకిందతాండా, మార్చి 4న కోటకొండ దిగువ తాండా, కోటకొండ ఎగువ తాండా, 5న రామానాయక్ తాండా, 7న నత్తిఓబన్నగారిపల్లె తాండాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాటు సారా వల్ల కలిగే దుష్ప్రభావాలు, తదితర అంశాలపై అవగహన కల్పించడం జరుగుతుందన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనంగా స్వాగతం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బందెల గౌతమ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మదనపల్లెకు విచేస్తున్న సందర్భంగా మదనపల్లె బీఎస్పీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ పార్టీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా మదనపల్లె వ్యక్తి ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు నుంచి మదనపల్లెకు వస్తున్న గౌతమ్‌కుమార్‌కు ఆ పార్టీ శ్రేణులు గజమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా వచ్చి ముందుగా కాలనీ గేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాటీజీ, శివ, గంగాధర్, మహేశ్, ప్రశాంత్, హరి, కన్నయ్య, రెడ్డెప్ప, రవితేజ, ఆనంద్, సారథి తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు : ఎంపీడీవో

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్) సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రంలో వున్న 10శాతం ధనిక, ఉన్నతస్థానం కలిగిన 20శాతం వ్యక్తులు బీపీఎల్ కుటుంబాలకు ఎంతో కొంత సాయం అందిస్తే పేదలు అభివృద్ధి చెందేవిధంగా ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో పీ4 సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 40శాతం సర్వేను పూర్తి చేశామని, మిగిలిన 60శాతం మార్చి 2వ తేదీలోగా పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

జాగ్రత్తలు పాటించడంతో క్షయ వ్యాధి నిర్మూలన

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటించడం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి అన్నారు. టీబీ వ్యాధి నిర్మూలన మాసోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని వడ్డిపల్లిలో ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, నీరసం, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న ఆశా కార్యకర్తను గాని, ఆరోగ్య సిబ్బందినిగాని సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి చికిత్స పూర్తిగా ఉచితమని, ఆరు నెలలు మందులు డాట్స్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అలాగే టీబీ రోగులకు నెలకు రూ.1000 వారి ఖాతాలో జమ చేయబడుతుందన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ డిమాండు చేశారు. పెద్దమండ్యంలో బాస్ 13వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, మురికినీటి కాలువలు, లైట్లు, నీటి సౌకర్యం లేని దళితవాడలను గుర్తించి సౌకర్యాలు కల్పించాలన్నారు. దళితులకు శ్మశాన స్థలాలను కేటాయించాలన్నారు. దళితుల భూములకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బాస్ మండల నాయకులు రామలక్ష్మణ, లక్ష్మీనారాయణ, విద్యార్థి నాయకుడు భానుప్రకాష్ పాల్గొన్నారు.

సీనియర్ డాక్టర్లను నియమించాలి

● బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పునీత్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సీనియర్ డాక్టర్లను నియమించాలని బహుజన యువసేన (బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదనపల్లె ఆస్పత్రిలో వైద్యవిధాన పరిషత్ కింద ఉన్న సీనియర్ డాక్టర్లు దాదాపు 24 మందిని బదిలీ చేశారని, అప్పటి నుంచి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని డాక్టర్లు వైద్యం చేసేవారని, రెండు నెలల క్రితం వారిని కూడా బదిలీ చేశారన్నారు. ప్రస్తుతం ట్రైనీ డాక్టర్లు, నర్సింగ్ విద్యార్థులే వైద్యం అందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ డాక్టర్లను నియమించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ డీసీహెచ్‌ఎస్‌ను పిలిపించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు శ్రీనివాసులు, జిలానీబాష, కె.శ్రీనివాసులు, జగదీష్, నవీన్, ద్వారక పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పునీత్

మందుబాబుల 'టూరిజం'

● అధ్వానంగా భవనాలు ● అద్దాలు ధ్వంసం.. విలువైన వస్తువులు చోరీ


చింతపర్తిలో ఉన్న టూరిజం భవనాలు


మందుబాబులు ధ్వంసం చేసిన భవనాల అద్దాలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 2009లో అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 80.64లక్షలతో ఇంటిగ్రేటెడ్ టూరిజం భవనా లు నిర్మించారు. ప్రారంభంలో ఎలా ఉన్నా రోజులు గడిచే కొద్దీ టూరిజం భవనాలు అధ్వానంగా తయారయ్యాయి. టూరిజం అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో భవనాలు శిథి లావస్థకు చేరాయి. దీంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు భవనాల అద్దాలు ధ్వంసం చేశారు. అంతేకాకుండా మరుగుదొడ్లలోని విద్యుత్ దీపాలు, కుళాయిలు, తదితర వస్తువులను దొంగలించుకుపోయారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు టూరిజం భవనాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామంలో నిర్మించిన ఏపీ టూరిజం భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ఎంతో గొప్ప ఆశయంతో నిర్మించిన ఈ భవనాలు మందుబాబుల విడిది గదులయ్యాయి. దిక్కూదివానం లేకపోయేసరికి విలువైన భవనాలు శిథిలావస్థకు చేరాయి. విలువైన వస్తుసామగ్రి అపహరణకు గురైంది.


అధ్వానంగా మరుగుదొడ్లు

ఎక్సైజ్ వాహనాల వేలం నేడు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో జిల్లా ఈఎస్ మధుసూదన్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు సీఐ లత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

గుర్రంకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో సర్టిఫికేట్లు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

27లోపు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) కోసం రైతులు ఈనెల 27వ తేదీలోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ప్రేమలత తెలిపారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల రాయితీలు పొందాలంటే ప్రతి రైతు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల పీఎం కిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, పంటల బీమా, అన్నదాత సుఖీభవ, తదితర రాయితీ పథకాలకు రైతులు అర్హులుగా ఉంటారన్నారు. ప్రతి రైతు ఆయా సచివాలయాల పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం,1బీ, ఆధార్‌కార్డు నకలు, సెల్‌ఫోన్ తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

రైతుకు ప్రత్యేక సౌకర్యాలు

కలికిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు కేటాయిస్తున్న విశిష్ట ప్రత్యేక సంఖ్య వల్ల అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని, రైతులు తప్పనిసరిగా విశిష్ట నమోదు సంఖ్య కోసం వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని పలువురు వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ పథకంలో భాగంగా సోమవారం 19వ విడత పంట సాయాన్ని ప్రధాని మోదీ రైతుల ఖాతాల్లోకి జమ చేసిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో శిలీంద్ర నాశినుల వాడకం గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించిన రైతులను సన్మానించారు. అనంతరం కొత్త వ్యవసాయ పంచాంగం, ట్రైకోడెర్మా, సుడోమోనాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమం చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి జె.మురళీకృష్ణ, పీలేరు ఏడీఏ వైవీ రమణారావు, కేవీకే శాస్త్రవేత్తలు కె.మాధురి, కె.నవీన, ఎ.శ్రీనివాసులు, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న డీఏవో మురళీకృష్ణ


ఎంపికైన విద్యార్థులతో కళాశాల యజమాన్యం, అధ్యాపకులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 27 మంది ఎంపిక

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సుందరం ఫాసనర్స్ కంపెనీ ప్రతినిధులు ఫైనలియర్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించారన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఏటా రూ.3లక్షల వేతనం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సయ్యద్‌హుస్సేన్, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమాంఖాసీం కోరారు. బదిలీపై మదనపల్లెకు వచ్చిన తహసీల్దార్ ధనుంజయులును మదనపల్లె డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇమాంఖాసీం మాట్లాడుతూ డీలర్లకు ఇచ్చే కమీషన్ సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె డీలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.కళాధర్, గౌరవసలహాదారుడు మురళి, కార్యవర్గ సభ్యులు ముంతాజ్, కవిత, దేవి, సుధాకర్ బాబు, రాజు, సాయి, ప్రభాకర్, అంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

'కామాంధులుగా ప్రవర్తిస్తున్న వైసీపీ నాయకులు'

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీలో కామాంధులు పేట్రేగిపోతున్నారని టీడీపీ ఎస్టీ విభాగం జిల్లా నాయకుడు మున్నానాయక్ విమర్శించారు. నిన్న విజయవాడలో స్పా కేంద్రాల ముసుగులో వ్యభిచారం నిర్వహించిన అపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, వైసీపీ నాయకుడు శంకర్‌నాయక్ పట్టుబడటం సిగ్గుచేటన్నారు. మదనపల్లె మండలం కోటవారుపల్లె తాండాకు కమిషన్ సభ్యుడి హోదాలో వచ్చిన శంకర్‌నాయక్‌ను తాము చందాలు వేసుకుని ఘనంగా సన్మానించి దారి సమస్య పరిష్కరించాలని కోరామన్నారు. కానీ ఆయన సమస్య పరిష్కరించకుండా వెళ్లిపోయారన్నారు.

మాదిగపల్లెను సందర్శించిన తహసీల్దారు

పీలేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దళితులు, ఇతర గ్రామస్థుల మధ్య భూవివాదం చెలరేగిన నేపథ్యంలో తహసీల్దారు భీమేశ్వరరావు సోమవారం జాండ్ల పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె మాదిగపల్లెను సందర్శించారు. వివాదానికి కారణమైన భూమి, దళితులు పోగొట్టుకున్న చెట్లను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి ఎవరికీ సమస్య రాకుండా హద్దులు చూపించాలని మండల సర్వేయర్ కీర్తన, గ్రామ సర్వేయర్ మహేశ్‌ను ఆదేశించారు. సర్వే పనులు పూర్తి చేసేంతవరకు ఎటువంటి నిర్మాణాలు, కంచెలు ఏర్పాటు చేయరాదని గ్రామస్థులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు రామకృష్ణ మాదిగ, గండికోట వెంకటేశ్, రాము, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'నివాసాల మధ్య ఉన్న చెక్క మిల్లును తరలించండి'

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం సైదాపేట వీధిలో నివాసాల మధ్య వున్న చెక్క మిల్లును దూరప్రాంతాలకు తరలించాలని షేక్ చాంద్‌బాషా ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ తమ నివాసాల మధ్య చెక్క మిల్లు ఉందని, చెక్కలను కట్ చేస్తున్నప్పుడు ఎక్కువ శబ్దం వస్తోందని, అలాగే చెక్కపొట్టు, దుమ్ముధూళి వస్తోందన్నారు. దీనివలన వృద్ధులకు అనారోగ్య సమస్యలు, విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి వుందన్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. వెంటనే చెక్క మిల్లును పరిశ్రమలు వుండే ప్రాంతానికి తరలించాలని కోరారు.

కరువు మండలాల్లో 150 పని దినాలు కల్పించాలి : పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

పీలేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కరవు మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 150 పనిదినాలు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లెలో జరుగుతున్న ఫారంపాండ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల్లో పీలేరు కూడా ఉందని, కాబట్టి విధిగా 150 పనిదినాలు కల్పించాలన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్లు, కందకాలు వంటి పనులు చేపట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీవో అశోక్‌రెడ్డి, రైతు సుబ్రహ్మణ్యం, ఈసీ రవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నంది విగ్రహ ప్రతిష్ఠ


వీరన్న కొండపై ప్రతిష్ఠ చేసిన నంది విగ్రహం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వీరభద్రాద్రి (వీరన్నకొండ)పై వెలసిన వీరభద్రస్వామి దేవాలయంలో శివరాత్రి మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కొండపై స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం హోమాలు, నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అధ్వాన్నంగా పారిశుధ్యం

● పిచ్చిమొక్కలతో మురుగునీటి కాలువలు


కందూరు రోడ్డులో పిచ్చి మొక్కలతో మురుగునీటి కాలువ

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లి పంచాయతీలో పారిశుధ్యం అధ్వాన్నస్థితికి చేరుకుంది. ముఖ్యంగా కందూరు రోడ్డు సమీపంలో మురుగునీటి కాలువలు శుభ్రం చేసి ఆరు నెలలైంది. దీంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మురుగునీరు పారడం లేదు. దీంతో దోమలు ప్రబలి గ్రామస్థులు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే గంగాపురంపల్లి, నాగులయ్యగారిపల్లి, ఉప్పరపల్లి, గూడుపల్లి, బుచ్చిరెడ్డివారిపల్లి, కొత్తపల్లిలో సీసీ రోడ్లు నిర్మించిన ప్రభుత్వం మురుగునీటి కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగునీరు మొత్తం రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఈ విషయమై ఎంపీడీవో పరమేశ్వరెడ్డిని వివరణ కొరగా త్వరలోనే మురుగునీటి కాలువలు నిర్మిస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా అన్నాభిషేకం

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాఘమాసం ఆఖరి సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అన్నాభిషేకం పీటీఎంకు చెందిన గార్ల వెంకటరమణ గుప్త, గాయత్రి దంపతులు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పీటీఎంకు చెందిన తోట సిద్దప్ప దంపతులు అందించారు. మాఘమాసం కావడంతో ఆలయానికి భక్తులు బారులు తీరారు.

మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం

● మల్లయ్యకొండలో ఇరుముడుల సమర్పణ


తాగు నీటి బోరును ప్రారంభిస్తున్న జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె/కురబలకోట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మల్లయ్యకొండ మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జయచంద్రారెడ్డి, సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, కురబలకోట మండలాధ్యక్షుడు వైజీ సురేంద్ర అంగళ్లు మల్లయ్యకొండలో శివమాల ఇరుమడి ధరించారు. మధ్యాహ్నం భక్తిశ్రద్ధలతో తంబళ్లపల్లె మల్లయ్యకొండకు చేరుకుని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఇరుముడులు సమర్పించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, భోజన వసతి, వైద్యం, మరుగుదొడ్లు, రవాణా, తదితర మౌలిక సదుపాయాలపై ఈవో మునిరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండపైన నూతనంగా వేసిన తాగునీటి బోరును ప్రారంభించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, ఉత్తమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, సోమశేఖర్, తులసీధర్‌నాయుడు, గంగుల్‌రెడ్డి, కొటాల శివకుమార్, ఆదిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, సుధాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

రామసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేవారిపల్లెలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, రాటకొండ మధుబాబు, జనసేన పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్ దారం అనిత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భవనేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, బీజేపీ కృష్ణమూర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు ఇంజం ఆనంద్‌కుమార్, ఏపీ మోడల్ చైర్మన్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ముందు సోమవారం మదనపల్లె పట్టణంలో పలు ఆలయాల్లో శివుడికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఇందులో భాగంగా చిప్పిలిలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరస్వామికి విశేషాలంకరణ, నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీసర్కిల్‌లో వున్న నీలకంఠేశ్వరాలయంలో రుద్రాభిషేకం, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. అలాగే భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు.

హంస వాహనంపై సిద్దేశ్వరుడు

కలకడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):కలకడ సత్యవతి నది ఒడ్డున వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు వడ్డెర కులస్థుల ఆధ్వర్యంలో కోలాటాలు, చెక్కభజనలు, కీలుగుర్రాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధులో ఊరేగింపు నిర్వహించారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ములకలచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని భక్త మార్కేండేయ శివాలయంలో సోమవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వాలీశ్వరస్వామి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి : డీఎస్పీ

వాల్మీకిపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం గ్రామ సమీపంలో వెలసిన వాలీశ్వరస్వామి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాలీశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ ఈవో రమణతో మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక వీఆర్వో, వీఏవో, పంచాయతీ సెక్రటరీ, సీఐ, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందితో నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.


వాలీశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఈవో రమణతో మాట్లాడుతున్న డీఎస్పీ